ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 9 సెప్టెంబరు 2025 | 5



డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేయాలి : కలెక్టర్



రాజమహేంద్రవరంరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కంది పంటకు సరైన మార్కెట్ ధర లభించడం లేదనే రైతుల ఆందోళన దృష్ట్యా ఉత్పత్తి సరఫరా మార్కె టింగ్ వ్యవస్థలో సమతుల్యతను తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు అవసరమని కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో ఉద్యాన, మార్కెటింగ్ అధికారులు,శాస్త్రవేత్తలు, మైక్రో ఇరిగేషన్ నిపుణులు, రైతులు వ్యాపార వర్గాల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఒకే పంటను వరుసగా పండించడం వల్ల ధరలు పడిపోవడం, మార్కెట్ ఒడిదొడుకులు రావడం వంటి సమస్యలు వస్తాయన్నారు. రైతుల ఉత్పత్తులను ఎఫ్‌పీవో పరిధిలోకి తీసుకురావడం ద్వారా గ్రేడింగ్, ప్యాకేజింగ్, డిమాండ్ ఉన్న మార్కెట్లకు సరుకుల పంపిణీ సులభతర మవుతుందన్నారు. నిల్వ ఉండని కూరగాయలను మార్కెటింగ్‌లో గ్రేడింగ్ సిస్టమ్ ప్రవేశపెట్టి వాటికి తగిన ధర రాబట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒక పంటకు రేటు బాగా పెరిగాయని అదే పంటను తిరిగి పెద్ద ఎత్తున సాగు చేస్తే డిమాండ్ తగ్గి రైతులు నష్టపోయే అవకాశం ఉందని రైతులు వాపోయారు.కార్యక్రమంలో జిల్లా హార్టీకల్చర్ అధికారి మల్లికార్జునరావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు

పీజీఆర్ఎస్‌లో 184 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ ,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అలసత్వం వద్దని జేసీ వై.మేఘస్వరూప్ జిల్లా అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మీమీ స్థాయిల్లో పరిష్కారం లభించే వాటి విషయంలో అలక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంతృప్తికర పరిష్కారం లేకపోవడం వల్లే ఫిర్యాదులు మళ్లీ రీ ఓపెన్ అవుతున్నాయన్నారు. సోమవారం 184 అర్జీలు వచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో టీ సీతారామమూర్తి, డీఎల్‌డీవో పి.వీణాదేవి, ముఖ్యప్రణాళిక జాయింట్ డైరెక్టర్ ఎల్.అప్పల కొండ,డీఎస్పీ బి.విద్య పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న జేసీ మేఘస్వరూప్



ఇరుకు సందులో అర్జీదారుల క్యూ

4 కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నాలుగు కార్పొరేషన్లకు డైరెక్టర్లను ప్రకటించింది.ఏపి రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా రాజోలు నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకుడు ముదునూరి వేణుగోపాలకృష్ణరాజు, ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకుడు వెన్నా ఈశ్వరుడును ఎంపిక చేశారు. రాష్ట్ర బ్యాక్ వర్డ్ క్లాసెస్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజోలు నుంచి జనసేన నాయకుడు గుబ్బల ఫణికుమార్‌ను ఎంపిక చేశారు. ఏపీ కమ్మ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా గోపాలపురం నుంచి టీడీపీ నాయకుడు లంక సత్యనారాయణ, జగ్గంపేట నుం చి టీడీపీ నాయకుడు పోతుల వెంకన్నచౌదరి (మోహనరావు),మండపేట నుంచి జనసేన నాయకుడు మేక సూర్యభాస్కరరావు, రాజానగరం నుంచి టీడీపీ నాయకుడు అడుసుమిల్లి శ్రీనివాస వెంకట రామారావు చౌదరి లను ప్రకటించారు. ఏపి స్టేట్ నూర్ బాషా /దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్లుగా ప్రత్తిపాడు నుంచి టీడీపీ నాయకుడు షూకూర్ షేక్, రంపచోడవరం నుంచి టీడీపీ నాయకుడు షేక్ సుభాన్, రాజమండ్రి నుంచి జనసేన నాయకుడు షేక్ బాషా లిమ్రాలను ప్రకటించారు.



బార్లా తెరిచినా!

నో చీర్స్ — బార్ల దరఖాస్తులకు వెనుకంజ

- ఎక్సయిజ్‌శాఖ నానా తంటాలు
- రెండోసారి బార్ల దరఖాస్తులకు పాట్లు
- మద్యం వ్యాపారులపై అదేపనిగా ఒత్తిళ్లు
- దరఖాస్తులు చేసి తీరాలని మీటింగ్‌లు
- లేదంటే దాడులు తప్పవని హెచ్చరికలు
- 14 వరకు దరఖాస్తు గడువు
- అధికారుల్లో బదిలీ భయం

(కాకినాడ/రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో బార్ల లైసెన్సులకు దరఖాస్తులు రప్పించడం కోసం ఎక్సైజ్‌శాఖ తంటాలు పడుతోంది. తొలిసారి పిలిచిన బార్లకు స్పందన రాకపోవడంతో రెండోసారైనా ఫలితం వచ్చేలా చేయడానికి తెగ ప్రయత్నిస్తోంది. ఉన్నతాధికారుల ఒత్తిళ్లు ఎక్కువగా ఉండడంతో ఎలాగైనా పని పూర్తయ్యేలా చేయడం కోసం తమ అధికారాలకు సైతం పదును పెడుతున్నారు. కొందరు మద్యం వ్యాపారులకు కబుర్లు పంపి బార్లను దక్కించుకోవాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. సిండికేట్లతో మాట్లాడుకుని అయినా నలుగురూ కలిపి ముందుకు రావాలంటూ ఆదేశాలిస్తున్నారు. లేదంటే ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బెల్ట్ కేసులు తప్పవంటూ పరోక్ష హెచ్చరికలు చేస్తున్నారు. పాత బార్ల నిర్వాహకులను పిలిచి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.బార్లను దక్కించుకుంటే సహకరిస్తామని భరోసా ఇస్తున్నారు. ఇంత చేసినా ఈ నెల 14 నాటికి అనుకున్న ఫలితం వస్తుందో రాదోనన్న బెంగ వీరిని వేధిస్తోంది.



అధికారుల ఒత్తిడి..

ఎలాగైనా అన్ని బార్లకు నాలుగేసి చొప్పున దరఖాస్తులు పడేలా చేయడానికి రకరకాల వ్యూహాలు అమలు చేస్తున్నారు. చాలా మంది తమకు ఆసక్తి లేదని అధికారులకు తెగేసి చెప్పేస్తున్నారు. ఇప్పటికే మద్యం దుకాణాలతో రాబడి లేక ఇబ్బంది పడుతున్నామని, ఒక్కో దరఖాస్తుకు రూ.5లక్షల నాన్‌రిఫండబుల్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేయలేమని చెబుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు రెండోసారి డ్రా సమయానికి దరఖాస్తులు వచ్చేలా కనిపించకపోవడంతో ఎక్సయిజ్ అధికారులు పరోక్ష హెచ్చరికలకు దిగుతున్నారు. దీంతో కొందరు వ్యాపారులు దారికి వస్తుండగా.. మరికొందరు ఏం చేయలేమని తెగేసి చెప్పేస్తున్నారు. ప్రధానంగా కాకినాడ, రాజమండ్రి, అమలాపురం ప్రాంతాల్లో బార్ లైసెన్స్ ఫీజులు భారీగా ఉండడంతో అసలు వ్యాపారులు దరఖాస్తులు చేయడానికి ముందుకు రావడంలేదు.14లోపు అన్ని బార్లకు దరఖాస్తులు వచ్చేలా చేసే బాధ్యత పైఅధికారులు తమకు అప్పగించడంతో ఈపని ఎలా పూర్తి చేయాలో తెలియక ఎక్సయిజ్ అధికారులు తంటాలు పడుతున్నారు.అయితే ఈసారి కూడా వ్యాపారస్తులు సారీ అంటున్నారు. ఈ టార్గెట్ పూర్తిచేయకపోతే ఎక్కడ బదిలీ వేటు పడుతుందోనని కొందరు సీఐలు హడలిపోతున్నారు.మొదటి నోటిఫికేషన్‌కి అధికారుల బెదిరింపులు తట్టుకోలేక కొందరు దరఖాస్తులు సమర్పించారు. కేవలం ఇప్పటి వరకూ వ్యాపారం చేసిన చోటు పోతుందని ప్రస్తుత వ్యాపారస్తులు కొందరు దరఖాస్తులు సమర్పించడానికి సిద్ధం అవుతున్నారు.ఇప్పటికే పాత బార్‌ల వద్ద 16 నుంచి పునఃప్రారంభి స్తామని బోర్డులు పెట్టడం అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మరో వైపు బార్ వ్యాపారస్తుల్లో అంతర్గతంగా పోటీ ఎక్కువ కావడంతో స్థలం, షాపుల అద్దెలు ఆయా యజమానులు భారీగా పెంచేశారు.

53కి 15 లైసెన్స్‌లు..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేటాయిం చిన బార్లకు లైసెన్స్ గడువు ముగియడంతో అధి కారులు ఇటీవల కొత్తగా బార్‌పాలసీ ప్రక టిం చారు. బార్లకు వేలం విధానం ఎత్తివేసి కొత్తగా లాటరీ విధానం ప్రవేశపెట్టారు. ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని నిబంధన విధిం చారు. ఒక్కో దరఖా స్తుకు రూ.5 లక్షల ఫీజు చెల్లించా లని ఆదేశాలు జారీ చేశా రు. ఉమ్మడి జిల్లాలో జన రల్, కల్లుగీత కార్మికులకు కలిపి మొత్తం 53 బార్లకు ఆగస్టు 18న గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఒక్కో బార్‌కు దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు, లైసెన్స్ ఫీజు ఏరియా ఆధారంగా రూ.55 లక్షల వరకు నిర్ణయించారు. 2025 నుంచి 2028 వరకు బార్ లైసెన్స్ కొనసాగుతుందని ప్రకటించారు. వేలం విధానానికి బదులు డ్రా తీసే విధానం అమల్లోకి తేవడంతో భారీ ఎత్తున వ్యాపారుల నుంచి పోటీ ఉంటుందని అధికారులు భావించారు. తీరా మొత్తం వ్యూహం బెడిసికొట్టింది. గత నెల 26 నాటికి దరఖాస్తుల గడువు ముగియగా వచ్చిన అప్లికేషన్లు సున్నా. దీంతో అప్పటికప్పుడు దరఖాస్తుల గడువు ఆగస్టు 29వ తేదీ వరకు పొడిగించారు. తీరా రెండో సారి గడువు ఇచ్చినా దరఖాస్తుదారులు పెద్దగా రాలేదు. దీంతో గత నెల 30న బార్లకు డ్రా తీయగా అధికారులు షాక్ తిన్నారు. కాకినాడ జిల్లాలో మొత్తం 17 బార్లకు నోటిఫికేషన్ ఇస్తే కేవలం ఐదు బార్లకు మాత్రమే నాలుగు చొప్పున దర ఖాస్తులు రాగా వాటిని వ్యాపారులకు కేటాయించారు. కోనసీమ జిల్లాలో 11 బార్లకు నోటిఫికేషన్ జారీ చేయగా ఒక బారుకు మాత్రమే దరఖాస్తులు రావడంతో కేటాయించారు. తూర్పుగోదావరి జిల్లాలో 25 బార్లకు కేవలం 9 బార్లకు మాత్రమే లైసెన్స్‌లు కేటాయించారు. ఒకరకంగా చెప్పాలంటే ఉమ్మడి జిల్లాలో మొత్తం 53 బార్లకు డ్రా తీయాల్సి ఉంటే కేవలం 15 మాత్రమే డ్రా పూర్తి చేసుకున్నాయి.మిగిలిన బార్లకు చేసేదిలేక రద్దు చేశారు.

38 బార్లకూ..రెండో సారీ..!

మిగిలిన 38 బార్లకు తిరిగి డ్రా తీయడం కోసం ఎక్సైజ్ శాఖ ఈ నెల 3న మళ్లీ రెండోసారి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. వ్యాపారులంతా దరఖాస్తులు చేసుకోవాలని కోరింది. ఈ నెల 14న సాయంత్రం 6 గంటల వరకు వ్యాపారులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. కాకినాడ జిల్లాలో 12 బార్లు, కోనసీమ జిల్లాలో 10, తూర్పుగోదావరిలో 16 బార్లకు ఈ నెల 14లోపు దరఖాస్తులు రావాల్సి ఉంది. 15న లాటరీ నిర్వహిస్తారు. తొలి విడత స్పందన లేని నేపథ్యంలో మలివిడత అన్ని బార్లకు దరఖాస్తులు వచ్చేలా చూడాలం టూ ఉన్నతాధికారులు ఎక్సైజ్ అధికారులపై తెగ ఒత్తిడి తెస్తున్నారు.దీంతో ఇప్పుడు జిల్లాల్లో ఎక్సైజ్ అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

నేడు ఎక్సయిజ్ శాఖ డీసీ రాక

ఎక్సైజ్ శాఖ డీసీ మంగళవారం కాకినాడ వస్తున్నారు.మూడు జిల్లాల ఎక్సైజ్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. దీనికి అధికారులు సమాయత్తం అవుతుండగా.. తమ గోడు వినిపించుకోడానికి వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. మొదటి నోటిఫికేషన్‌కి దరఖాస్తుల విషయంలో కోనసీమ జిల్లా ఎక్సైజ్ అధికారిపై వేటు పడగా, తూర్పు గోదావరి త్రుటిలో తప్పించుకొంది. కాకినాడ కాస్త పర్వాలేదని అనిపించింది. అయితే ఇప్పటికే కొన్ని బార్‌లు కేటాయింపు జరగడంతో నిబంధనల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ మార్పులు ఉండే అవకాశం లేదు. అధికారులు ప్రైవేటు షాపుల దరఖాస్తులదారులకు మెసేజ్‌లు పంపుతున్నా పరిస్థితుల్లో మార్పు కానరావడం లేదు. బార్ పాలసీ వల్ల గతం కంటే మెరుగైన లాభాలు వస్తాయని ప్రభుత్వం చెబుతున్నా.ఆ అంశాన్ని క్షేత్రస్థాయిలోకి ఎక్సయిజ్ అధికారులు తీసుకెళ్లలేకపోతున్నారనే వాదన వినవస్తోంది.



పోలవరమే

- ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ అమలు వేగవంతం
- 33 గ్రామాల ప్యాకేజీ అప్రూవల్ కమిషరేట్‌కు
- ప్రాసెస్‌లో 11 గ్రామాల ప్యాకేజీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పోలవరం ప్రాజెక్టు మొదటి దశ ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ అమలు వేగవంతమైంది. పెండింగ్‌లో ఉన్న 44 గ్రామాలకు సంబంధించిన ప్యాకేజీలో 33 గ్రామాల లబ్ధిదార్లను ఎంపిక చేసి ఆర్‌అండ్ఆర్ కమిషనర్ అనుమతికి పంపింది. మరో 11 గ్రామాల నివేదికను 15 రోజుల్లో పూర్తి చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు. పునరావాస కాలనీల నిర్మాణాలు వేగవంతం చేయనుంది. వాటిపాత కాంట్రాక్టర్లను నిలిపివేశారు. కొత్త సంస్థల ఎంపికకు టెండర్లు పిలిచారు.అవి ఖరారు కావాల్సి ఉంది.

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి మొదటి దశలో 41.15 కాంటూరు వరకూ భూసేకరణ, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. గత వైసీపీలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్యాకేజీ పనులను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి దశను ప్యాకేజీ 1ఎ,1బీగా విభజించి అమలు చేయడం ఆరంభించింది.ముంపు గ్రామాల్లో మొత్తం 38,060 పీడీఎఫ్‌లు (ప్రాజెక్టు డిస్‌ప్లేస్‌మెంట్ ఫ్యామిలీలు) ఉన్నాయి. అందులో మొదటి దశ 1ఎలో 26,946 పీడీఎఫ్‌లు ఉన్నాయి.వాటిలో ఇప్పటి వరకు 19,482 పీడీఎఫ్‌లకు ప్యాకేజీ చెల్లించారు.మొదటి దశ1బీలో 27,114 పీడీఎఫ్‌లు ఉండగా వాటిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పరిధి కుమ్మరిలోవలోని 472 పీడీఎఫ్‌లకు ప్యాకేజీ చెల్లించారు. మొత్తం రూ.1212.95 కోట్లు చెల్లించారు. కానీ 1బీలో 2021 వరద సమయంలో మరో 48 గ్రామాలు మునిగిపోయాయి. అవి వాస్తవానికి రెండో దశ అయిన 45.75 కాంటూరు పరిధిలో ఉన్నాయి. కానీ మునిగిపోవడం వల్ల మొదటి దశ 41.15 కాంటూరు పరిధిలోకి తెచ్చి 1బీ పరిధిలో పెట్టి ప్యాకేజీ అమలు చేస్తున్నారు. దీంతో మిగతా పీడీ ఎఫ్‌లు ఇందులో కలిశాయి. ప్రస్తుతం కలిసిన 48 గ్రామాల పరిధిలో 4 గ్రామాల్లో ప్రజలు లేరు. అందువల్ల మిగిలిన 44 గ్రామాల పరిధిలోని ప్రజలకు ప్యాకేజీ అమలు చేస్తున్నా రు. అందులో ఇప్పటికే 33 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి వారికి రావాల్సిన లబ్ధిని నిర్ణయించి ఆర్‌అండ్ఆర్ కమిషనర్ అనుమతికి ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు అధికారి కార్యాలయానికి పంపించింది. ఇందులో కెఆర్.పురం యూనిట్ పరిధిలో 13 గ్రామాలు, చింతూరు యూనిట్ పరిధిలో 30 గ్రామాలు ఉన్నాయి. అనుమతులు వచ్చేస్తే ఇక్కడ ఎస్టీ, ఎస్సీలకు ఒక్కో కుటుంబానికి రూ.6.86 లక్షలు, ఇతరులకు రూ.6.36 లక్షల వంతున పరిహారం ఇస్తారు. చింతూరు కెఆర్‌పురంలో లచ్చిరెడ్డిగూడెం, టేకూరు, చింతూరు పరిధిలో మరో 11 గ్రామాలు ప్యాకేజీని సిద్ధం చేస్తున్నారు. వాటిలో గుండుగూడెం, వీఆర్‌పురం, ఏజీ కోడేరు, చింతూర్, మల్లెతోట, టేకులబోరు, కూనవరం గ్రామాలు ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు రెండో దశ అంటే 45.75 కాంటూరు వరకూ విస్తరణ ఉంది. ఆ పరిధిలో మరో 201 గ్రామాలు వాటి పరిధిలో సుమారు 58 వేల కుటుంబాలు ఉన్నాయి. ఇక మొదటి దశ 1ఎ పరిధిలో 26,946 కుటుంబాలకు 75 పునరావాస కాలనీలు నిర్మించాల్సి ఉంది. అందులో 26 పూర్తయ్యాయి. ఇంకా 49 వివిధ దశల్లో ఉన్నాయి.గతంలోనే టీడీపీ హయాంలో వీటిలో చాలా కాలనీల నిర్మాణం మొదలు పెట్టగా తర్వాత వచ్చిన వైసీపీ నిర్లక్ష్యం చేసింది.తెలుగుదేశం కూటమి ప్రభుత్వం పాత కాంట్రాక్టర్లను రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలిచింది. అవి ఖరారైన వెంటనే పనులు మొదలవుతాయి.

అప్రూవల్ వస్తే డబ్బులు

మొదటి దశ ఆర్‌అండ్ ప్యాకేజీ అమలు వేగవంతం చేశాం. 32 గ్రామాల ప్యాకేజీ నివేదికలు అప్రూవల్‌కు పంపాం. అప్రూవల్ వస్తే నిర్వాసితుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బు జమవుతుంది.

- అభిషేక్, పోలవరం అధికారి



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో తదితరులు

అత్యవసర వైద్య సేవలకే అంబులెన్స్‌లు

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్/కొవ్వూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందించడానికి కొత్తగా అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు (ఏఎల్ఎస్) అంబులెన్సులు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు తొలి విడతగా మూడు ఎఎల్ఎస్ అంబులెన్సులను కేటాయించిందని వెల్లడించారు. మూడు కొత్త అంబులెన్సులను ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంకతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం జిల్లాలో 21 అంబులెన్సులు పనిచేస్తున్నాయని, వీటిలో 11 పాత అంబులెన్సుల స్థానంలో ఆదునిక వైద్య సౌకర్యాలతో కూడిన ఐదు ఏఎల్ఎస్ అంబులెన్సులు, ఆరు బేసిక్ లైఫ్ సపోర్టు అంబులెన్సులను ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిందన్నారు. తొలి విడతగా జిల్లాకు వచ్చిన మూడు అంబులెన్సులను మూడు నియోజకవర్గాలకు పంపుతున్నామని తెలిపారు. రానున్న రెండు వారాల్లో మిగిలిన ఎనిమిది అంబులెన్సులు జిల్లాకు చేరతాయని వివరించారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు (ఏఎల్ఎస్) అంబులెన్స్‌లను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు రెవిన్యూ డివిజన్‌కు 3 వాహనాలను కేటాయించారన్నారు. ఒకేసారి ఇద్దరు పేషెంట్లకు ఆక్సిజన్, వెంటిలేటర్ అందించే సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ ఎస్ఎం పద్మ, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ పాల్గొన్నారు.

మీకు నేనున్నా..



మీ సమస్యలు చెప్పండి నేను పరిష్కరిస్తా.. అంటూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దివ్యాంగ విద్యార్థులను ప్రశ్నించారు..రాజమహేందరవరం దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.దీనిలో భాగంగా పలువురు దివ్యాంగ విద్యార్థుల సమస్యలు విన్నారు.. పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. - రాజమహేంద్రవరం సిటీ



దొంగలు!

- జీజీహెచ్‌లో ఏసీ కాపర్‌పైపులు చోరీ
- రూ.50 వేలు ఉంటాయని లెక్క
- సెక్యూరిటీ గార్డుల నుంచి వసూలు?
- ఆసుపత్రి ఉద్యోగుల్లో చర్చనీయాంశం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో కొద్దిరోజుల క్రితం ఏసీ కాపర్ పైపులు చోరీకి గురయ్యాయి. ఆసుపత్రి పై అంతస్తులో సూపరింటెండెంట్ ఛాంబర్‌కు సమీపంలోని ఒక డిపార్టుమెంట్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. దీనిపై ఆసుపత్రి అధికారులు భగ్గుమన్నారు. ఆసుపత్రి సెక్యూరిటీ ఇన్‌ఛార్జిని పిలిపించి మాట్లాడారు. ఏసీ టెక్నీషియన్‌ను పిలిపించి చోరీకి గురైన కాపర్ పైపుల విలువ కట్టించారు. సుమారు రూ.50 వేలు విలువ కట్టినట్టు తెలిసింది. రాత్రిపూట సెక్యూరిటీ గార్డులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడం వల్లే కాపర్‌పైపులు చోరీకి గురయ్యాయని నిర్ణయానికి వచ్చి ఆ మొత్తాన్ని వారి నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. గత నెలలో సెక్యూరిటీ గార్డులకు జీతాలు పడగానే ఒక్కొక్కరి నుంచి రూ.700లు చొప్పున వసూలు చేసేశారు. తమకొచ్చే జీతాలే అంతంతమాత్రంగా ఉంటాయని, చోరీ జరిగిందనే కారణంతో తమ నుంచి ఇలా డబ్బులు వసూలు చేయడం భావ్యం కాదని కొంతమంది సెక్యూరిటీ గార్డులు మొత్తుకున్నా ససేమిరా ఇవ్వాల్సిందే అంటూ తీసుకున్నారు. ఇలా సుమారు రూ.40,000లు వసూలైనట్టు సమాచారం. తప్పు ఎవరు చేశారో తెలియదు కానీ సెక్యూరిటీ గార్డులను మాత్రం బలిపశువులుగా చేశారు. చోరీ ఎక్కడ జరిగిందో తేలితే మరోసారి జరగకుండా జాగ్రత్త పడొచ్చు. అలా కాకుండా అధికారులు కప్పిఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ సొమ్ము ఎక్కడుంది ?

సెక్యూరిటీ గార్డుల నుంచి వసూలు చేసిన సొమ్ములపై ఇప్పుడు ఆసుపత్రి ఉద్యోగుల్లో తీవ్రస్థాయిలో చర్చ నడుస్తోంది. ఇలా వసూలు చేసిన సొమ్ము ఎవరికి ఇచ్చారు ? అధికారులకు ఇచ్చారా ? లేక ఎవరైనా తీసుకున్నారా ? ఇవ్వకపోతే ఎవరి దగ్గర ఉంది ? ఈ సొమ్ము ఏం చేయనున్నారు ? అంటూ అనేకరకాలుగా చర్చించుకుంటున్నారు. సొమ్ములు వసూలు చేసి దాదాపు నెల రోజులు కావడంతో ఇప్పుడు సెక్యూరిటీ గార్డులు అందరిలోనూ ఇలాంటి అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజంగానే అధికారులు వసూలు చేయమన్నారా లేక ఎవరైనా ఒత్తిడి చేశారా అనే చర్చ కూడా నడుస్తోంది. ఇదిలా ఉంటే వారం రోజుల కిందట ఆపరేషన్ థియేటర్లకు సంబంధించిన ఏసీ కాపర్ పైపులు చోరీకి గురైనట్టు తెలిసింది. దీనికి కూడా తమనే బాధ్యులను చేస్తే మా పరిస్థితి ఏంటంటూ సెక్యూరిటీ గార్డులు మదన పడుతున్నారు. మొత్తానికి ఈ వసూళ్ల వ్యవహారం ఇప్పుడు జీజీహెచ్ ఉద్యోగ వర్గాల్లో హాట్‌హాట్‌గా మారింది.

సొసైటీలోని యూరియా నిల్వల్లో వ్యత్యాసం


భూపాలపట్నంలో స్టాకు తేడా - అమ్మకాలు నిలుపుదల



రాజానగరం , సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భూపాలపట్నం సొసైటీలో యూరియా బస్తాల నిల్వలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్‌కు గొడౌన్‌లో ఉన్న బస్తాలకు వ్యత్యాసాలను గుర్తించడంతో రూ19.80 లక్షల విలువైన యూరియా బస్తాల అమ్మకాలను విజిలెన్స్ అధికారులు నిలిపివేశా రు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జి. మధుబాబు, అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌వీ.లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయాధికారి ఎ.కళ్యాణసూర్యకుమార్ తమసిబ్బందితో కలిసి సోమవారం భూపాలపట్నంలోని సొసైటీ, మనగ్రోమోర్ దుకాణంలో యూరియా విక్రయాలు, నిల్వలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భూపాలపట్నం సొసైటీ నిల్వలో తేడాలు గుర్తించి యూరియా అమ్మకాలు తాత్కాలికంగా నిలిపివేశారు.మన గ్రోమోర్‌లో సక్రమంగా ఉన్నట్టు గుర్తించారు.

మెడికల్ కళాశాలలపై వైసీపీ రాద్ధాంతం


ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పది మెడికల్ కళాశాలల నిర్మాణ పనులు పీపీపీ పద్ధతిలో కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని ప్రయత్నిస్తుంటే ప్రైవేటు పరం చేస్తున్నామంటూ వైసీపీ ఎందుకు గగ్గోలు పెడుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మండిపడ్డారు.బిక్కవోలు మండల కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు.2020లో వైసీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేయించుకుని 2023 నాటికి పూర్తి చేయలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేంద్ర నిధులతో రాజమహేంద్రవరం, ఏలూరు, నం ద్యాల, పాడేరు, మచిలీపట్నం, పిడుగురాళ్లలో కళాశాలలు పూర్తి చేశామన్నారు. మిగిలిన పది కళాశాలల నిర్మాణాలు పూర్తి చేయాలంటే రూ.6 వేలు కోట్లు కావాలని, వీటి నిర్వహణకు ఏటా రూ.1500 కోట్లు కావాలన్నారు. పది కళాశాలలను పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేస్తున్నామని వీటి నియంత్రణ ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటుందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని వాటిని సరిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

చక్కనయ్యా.. చందమామ!



చందమామ మాయమైపోయాడు.. చక్కనయ్యా చందమామ ఎక్కడున్నావో అన్నా.. చందమామ రావె.. జాబిల్లి రావె.. అన్నా ఆదివారం రాత్రి కనిపించలేదు.. చంద్ర గ్రహణం కావడంతో మబ్బుల చాటున దాక్కున్నాడు.. చివరికి గ్రహణం విడుపు సమయం సోమవారం తెల్లవారు జామున ఇలా చందమామ బయటపడ్డాడు.. తొలుత అర్ధచంద్రా కారంలో కనిపించి మెల్లమెల్లగా తెల్లారేసరికి ఇలా చందమామ కనిపించాడు.. తెల్లవారుజామున నిండు చంద్రుడిని ఆనందంగా తిలకించారు.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



నిండు గోదారి

ధవళేశ్వరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నిండుగా ప్రవహిస్తూనే ఉంది. గత 15 రోజులుగా గోదావరి వరద పెరిగింది. నిలకడగా కొనసాగుతుంది. సోమవారం సాయంత్రానికి ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 4,55,627 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.20 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల నిమిత్తం డెల్టా కాలువకు 14 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 4900 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 2100 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7 వేల క్యూసెక్కులు చొప్పున విడుదలవుతున్నాయి.భద్రాచలం వద్ద నీటిమట్టం 26 అడుగులుగా నమోదైంది.



వైరం మరచి..

కొత్తపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కలిసి ఉంటే కలదు సుఖం.. ఇది అక్షరాలా నిజం.. ఈ చిత్రమే అందుకు ఉదాహరణ. పిల్లి కుక్కకు ఎక్కడైనా పడుతుందా.. కనిపిస్తే చాలు కొట్టుకుంటాయ్.. అయితే ఈ చిత్రంలో చూడండి.. కుక్కపై పిల్లి ఎంత దర్జాగా పడుకుందో.. ఎందుకంటే జాతి వైరం మరచి స్నేహం చేస్తుంది. జాతివైరాన్ని మరిచి ఒక పిల్లి పిల్లను అక్కును చేర్చుకుంది శునకం.తన పొట్టపైనా పడుకున్నా ఏమనకుండా అలాగే ఉండిపోయింది. కొత్తపేట రామాలయం వీధిలో పిల్లి తల్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది..ఆ పిల్లి పిల్లలు రోడ్డున పడ్డాయి.. నాటి నుంచి ఆ పిల్లి పిల్లలను ఆదరిస్తూ అక్కున చేర్చుకుంటుంది శునకం. ఎవరూ ఆ పిల్లి పిల్లల వద్దకు రాకుండా కాపాడుకుంటోంది. ఆ పిల్లి పిల్లలకు అమ్మగా మారిపోయింది..

ఆపరేషన్.. డాగ్స్!





కుక్కల నియంత్రణకో కేంద్రం

- కుక్కల నియంత్రణకు కోర్టు ఆదేశాలు
- వీధి కుక్కలకు కు.ని ఆపరేషన్లు
- అమలాపురంలో ప్రత్యేక భవనం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎటు చూసినా..ఎక్కడ చూసినా కుక్కల గుంపులే.. కొత్తగా ఏదైనా వీధిలో అడుగు పెట్టాలంటే ఏ కుక్క వచ్చి మీద పడుతుందోనని భయం.. అంతలా కుక్కల సంఖ్య పెరిగిపోయిం ది. అక్కడక్కడా దాడులు పెరిగాయి. ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలో అయితే వరుసగా జరిగిన కుక్కల దాడులతో దేశ అత్యున్నత న్యాయస్థానం కల్పించుకుని తీర్పు చెప్పాల్సిన పరిస్థితి దాపురించింది. తొలుత ఢిల్లీకి మాత్రమే పరిమితమైన తీర్పును సవరణ చేస్తూ త్రిసభ్య ధర్మాసనం దేశ మంతటికీ వర్తించేలా ప్రకటించింది. కుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్ (పిల్లలు పుట్టకుండా నియంత్రణ ఆపరేషన్లు) చేయించాలని పేర్కొంది. శస్త్రచికిత్స అనంతరం వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారో తిరిగి అక్కడే విడిచి పెట్టాలని ఆదేశించింది. రేబిస్ వ్యాధులు, విపరీత ప్రవర్తన ఉన్న కుక్కలను మాత్రం స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ అనంతరం ప్రత్యేక షెల్టర్లకు తరలించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో అమలాపురం హిందూ శ్మశానాటిక సమీపంలో పశుజనన నియంత్రణ (ఏబీసీ), యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కేంద్రం(ఏఆర్వీ) ప్రత్యేకంగా నిర్మించారు.ఆ కేంద్రంలో ప్రత్యేక వైద్య నిపుణుల బృందం పర్యవేక్షణలో సిబ్బంది కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం ప్రారంభించారు. ప్రతీ కుక్కకు షెల్టర్లు నిర్మించి అందులోనే ఆహారం, నీరు అందిస్తున్నారు. వాటి ఆరోగ్యం కుదుట పడగానే తిరిగి ఎక్కడ నుంచి తెచ్చారో అక్కడే విడిచిపెడుతున్నామని మునిసిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు.

అమలాపురంలో ప్రత్యేక కేంద్రం

అమలాపురం పురపాలక సంఘంలో కుక్కల నియంత్రణకు సంబంధించి పశుజనన నియంత్రణ (ఏబీసీ) భవనాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. ప్రత్యేక వైద్య సిబ్బందితో పాటు కమిషనర్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య బృందాన్ని నియమించారు. కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నారు. ఏ రోజుకారోజు కుక్కలను పట్టుకుని పశుజనన నియంత్రణ కేంద్రానికి ఆ సిబ్బంది తరలిస్తారు. వైద్యులు ఆపరేషన్ చేయడంతో పాటు అవసరమైన కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందిస్తున్నారు.రెండు రోజులుగా 54 వీధికుక్కలకు పశుజనన నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించినట్టు కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం పట్టణంలో ఉన్న వీధి కుక్కలన్నింటికీ పశుజనన నియంత్రణ ఆపరేషన్లు చేసే దిశగా చర్యలు చేపట్టామని వివరించారు.

సుప్రీం తీర్పు..

సుప్రీం కోర్టు తీర్పును కొందరు సమర్థించగా మరికొందరు వ్యతిరేకించారు. పర్యావరణ సమతుల్యతను పరిగణలోనికి తీసుకోకుండా తీర్పు ఇస్తారా అని ప్రశ్నించినవారు ఉన్నారు. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగిన కుక్కల దాడుల ఘటనలను సోషల్ మీడియాలో విస్తృతంగా ఎందరో వైరల్ చేశారు. అటువంటి కుక్కలను తీసుకువెళ్లి నియంత్రణకు చేపట్టిన చర్యలను వ్యతిరేకించిన వారి ఇళ్ల వద్ద వదిలేయాలని పోస్టింగ్‌లు సైతం పెట్టారు.

రోడ్ల పక్కన ఆహారం నేరం



ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు వీధి కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో ఆహారం పెట్టడం నేరం. ఉల్లంఘించి ఆహారం పెడితే శిక్షణ తప్పదని సైతం హెచ్చరించారు. కుక్కలకు ఆహారం అందించడానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వీధుల్లో కుక్కలకు అన్నం పెట్టినవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కలను జంతు ప్రేమికులు దత్తత తీసుకోవచ్చునన్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలేవి?

వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి గతంలోనే ప్రభుత్వాలు జీవోల ఇచ్చాయి. వాటిని అమలుచేసిన అధికారులు లేరు. పట్టించుకున్న పాలకులు లేరు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కమిటీలు ఏమీ చేయకపోవడం వల్ల గ్రామాల్లో కుక్కల బెడద పెరిగిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీధికుక్కల నియంత్రణలో భాగంగా వాటిని పట్టుకోవడం, సురక్షిత పద్ధతుల్లో ఆపరేషన్లు చేయడం దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి ఎన్నో పనులు చేయాల్సిన కమిటీలు నేడు జాడ లేకుండా పోయాయి.

హిజ్రాలకు ఉచిత శిక్షణ



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలు, నైపుణ్యాభివృద్ధిలో హిజ్రాలకు ఉచిత శిక్షణ అందించడానికి ట్వెంటీ ఫస్ట్ సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ముందుకు వచ్చిందని హిజ్రాలు, వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహాయ సంచాలకులు శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు సాధించడానికి, ఐటీ, ఐటీఈఎస్ రంగాల్లో ఉపాధి అవకాశాలకు శిక్షణ ఇవ్వడం ముఖ్యోద్దేశమన్నారు. తూర్పు, కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగిన హిజ్రాలు తమ దరఖాస్తులను కాకినాడలోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరింత సమాచారం కోసం 0884-2352303 నెంబరులో పనివేళల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.



యూరియా కావాలయ్యా!

అధికారులేమో యూరియా కొరత లేదంటారు.. రైతులు చూస్తే యూరియా కావాలంటూ క్యూలు కడతారు.. ఇచ్చింది చాలక మళ్లీ మళ్లీ కావాలంటున్నారు.. గొల్లప్రోలులో సోమవారం రైతులు ఇలా బారులు తీరారు. - గొల్లప్రోలు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలిలో జగన్మోహినీకేశవస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కాకినాడ జిల్లా సామర్లకోటలో ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి



కాకినాడ జిల్లా అన్నవరంలో ఆలయ సంప్రోక్షణ అనంతరం సత్యదేవుని దర్శించుకుని వస్తున్న భక్తులు

గ్రహణం వీడి... గుడులు తెరుచుకుని

- చంద్రగ్రహణం అనంతరం సంప్రోక్షణ చేసి ఆలయాలను తెరిచిన అర్చకులు
- స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు

సామర్లకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వర ఆలయాన్ని చంద్ర గ్రహణం విడుపు అనంతరం సోమవారం ఉదయం తెరిచి సంప్రోక్షణ చేశారు. భీమేశ్వరస్వామికి పంచద్రవ్యాలతో అభిషేకం, స్వామివారికి, బాలాత్రిపురసుందరి అమ్మవార్లకు విశేష పుష్పార్చన చేసినట్టు ఈవో బళ్ళ నీలకంఠం తెలిపారు. సుమారు 1,500 మంది అన్నప్రసాదం స్వీకరించారు. పురాతన మాండవ్యనారాయణస్వామి ఆలయం, హరిహర క్షేత్రం, అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరాలయంలో వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో ప్రధాన పండితుడు విశేష పూజలు చేశారు. గ్రహణం విడిచిన తర్వాత పట్టణంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి.

అన్నవరం (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం మూతపడిన సత్యదేవుడి ఆలయం సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరుచుకుంది. వేకువజామున మూడు గంటల నుంచి సిబ్బంది సంప్రోక్షణ చేపట్టారు. అనంతరం మూలవరులకు అర్చకస్వాములు ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి సర్వ దర్శనాలు ప్రారంభం కాగా భక్తులు స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు.

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీకేశవస్వామి ఆలయాలను చంద్ర గ్రహణం సంపూర్తి అనంతరం సోమవారం ఉదయం తెరిచారు. అర్చకులు సంప్రోక్షణ చేసి పూజలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తికి ఉత్తమ అధ్యాపక అవార్డు అందజేసి సత్కరిస్తున్న జేఎన్టీయూకే ఉప కులపతి ప్రసాద్

అభ్యసనకు అంతులేదు : జేఎన్టీయూకే వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అభ్యసనకు అంతులేదని, నిబద్ధత, క్రమశిక్షణ, నిరంతరం శ్రమించేతత్వం అధ్యాపకులకు ఎంతో అవసరమని కాకినాడ జేఎన్టీయూ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ పేర్కొన్నారు. వర్శిటీలోని యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం సెమినార్ హాల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జేఎన్టీయూకే, యూసీఈకే అధ్యాపక సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ వి.శ్రీనివాసులు అధ్యక్షతన గురుపూజోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ప్రసాద్, అతిథులుగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్స్ దీక్షితులు, స్వరూపారాణి హాజరై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ అధ్యాపకులు ఎల్లప్పుడూ నైతిక విలువలు పాటిస్తూ సమాజ ఉన్నతికి తోడ్పడాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికైన ఏఎస్ఎన్ చక్రవర్తి, ఎస్.సత్యవేణి, కె.రవీంద్ర, డి.కోటేశ్వరరావు, బి.లీలాకుమారి, టి.లక్ష్మణకిషోర్‌లను వీసీ, అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో జేఎన్టీయూకే డైరెక్టర్లు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమేశ్వరుని సేవలో తెలంగాణ సీఎస్

ద్రాక్షారామ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలోని భీమేశ్వరాలయానికి సోమవారం తెలంగాణ చీఫ్ సెక్రటరీ సోమేష్‌కుమార్ విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నంది మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. దాత మీనవల్లి వెంకటశ్రీనివాస్ ఉన్నారు.

భీమేశ్వరాలయానికి కోస్ట్‌గార్డ్ డీఐజీ రాజేష్‌మిట్టల్ విచ్చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనకు నంది మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.



శిక్షణ తరగతుల ప్రారంభ సభలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రమణ

'నూతన ఎంపీడీవోలు పరిపాలనాపరంగా మరింత నైపుణ్యం కలిగి ఉండాలి'

సామర్లకోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన ఎంపీడీవోలు పరిపాలనాపరంగా మరింత నైపుణ్యం కలిగి ఉండాలని భావించి ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ పేర్కొన్నారు. నూతన ఎంపీడీవోలు 46 మందికి సోమవారం నుంచి నెల పాటు జరిగే శిక్షణ తరగతులు ఇక్కడ సోమవారం ప్రారంభమయ్యాయి. వీరికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్ర శిక్షణ ఇస్తారు. ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ శిక్షణకు ముందు, శిక్షణ అనంతరం పరిపాలన నైపుణ్యాలను మరింత పెంచుకునేలా శ్రద్ధ, క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌రహిత స్టీలు మంచినీటి సీసాలను శిక్షణార్థులకు పంపిణీ చేశారు. డీడీవో శ్రీనివాసశర్మ, ఫ్యాకల్టీ జి.సుశీల, శేషుబాబు, చక్రపాణిరావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణార్థులకు విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలోనే రెసిడెన్షియల్ పద్ధతిలో వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని రమణ చెప్పారు.

కాంగ్రెస్‌తోనే భారత రాజ్యాంగ పరిరక్షణ

- ఎస్సీ వర్గీకరణను చంద్రబాబు వెనక్కి తీసుకోవాలి
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే భారత రాజ్యాంగ పరిరక్షణ జరుగుతుందని సీడబ్ల్యూసీ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. కాకినాడలోని ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం కాంగ్రెస్‌కు అండగా ఉన్న దళితులను విభజింజేందుకు టీడీపీ ఆనాడే వ్యూహం పన్నిందన్నారు. కేసీఆర్ వెనుక మాదిగలు రాజ్యాధికారం దిశగా ఉండడంతో రాష్ట్ర విభజన జరిగిందన్నారు. ఇప్పుడు దళితుల మధ్య వివాదాలకు కారణమవుతున్న ఎస్సీ వర్గీకరణను చంద్రబాబు వెనక్కి తీసుకోవాలన్నారు. వైఎస్సార్ మరణం తర్వాత తెలంగాణకు చెందిన దామోదర రాజనరసింహకు సీఎం పదవి కట్టబెడితే ఆంధ్ర రాష్ట్ర విభజన జరిగేది కాదన్నారు. రాజ్యాంగ పరిరక్షణ దిశగా కుప్పం నుంచి దళితుల పాదయాత్ర జరుగుతోందన్నారు. ప్రధానిగా మోదీ 11 ఏళ్లుగా కొనసాగుతున్నారని, 2029 వరకు ఆ పదవిలో ఉంటారనే నమ్మకం తనకు లేదన్నారు. ఆయిల్ కొనుగోలులో మోదీ ప్రభుత్వం భారీ కుంభకోణానికి పాల్పడుతోందన్నారు. బ్యాంకుల నుంచి రూ.14.5 లక్షల కోట్ల రుణమాఫీ విషయంలో బీజేపీ తీవ్ర అవినీతికి పాల్పడిందన్నారు. రాష్ట్రంలో వాట్సాప్ పాలన కాకుండా వాటాల



పాలన సాగుతోందన్నారు. అమరావతిలో 70వేల ఎకరాలను రైతుల నుంచి బలవంతంగా సేకరించి పారిశ్రామికవేత్తలకు చౌకగా కట్టబెడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కేవలం మోదీ, అమిత్‌షా భజన చేయడానికే పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో సానుభూతి పెరుగుతోందని, బయటకు వెళ్లిన నాయకులంతా తిరిగి వస్తారన్నారు.




శ్రీనివాస్‌కు పాదగయ క్షేత్ర ప్రాశస్త్యం వివరిస్తున్న వేద పండితుడు

పాదగయలో దక్షిణ మధ్య రైల్వే చీఫ్ వర్క్స్ మేనేజరు పూజలు

పిఠాపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి దక్షిణ మధ్య రైల్వే చీఫ్ వర్క్స్ మేనేజరు ఎస్.శ్రీనివాస్ సోమవారం విచ్చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనం పలికారు. ఆలయ అధికారులు శ్రీనివాస్‌ను శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట సామర్లకోట రైల్వేస్టేషన్ మేనేజరు ఎం.రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు సీహెచ్ శ్రీనివాస్, ఎం.రవికృష్ణ వున్నారు.

ఆకాశం రంగుల మయం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం కొత్తూరు వద్ద సాయంత్రం ఆకాశం ఎరుపెక్కి ఇలా కనిపించింది. ఆలమూరు, ఆంధ్రజ్యోతి



యానాం గౌతమి గోదావరి నది ఒడ్డున సూర్యాస్తమయం వేళ ఆకాశం పసుపుమయమైంది. యానాం, ఆంధ్రజ్యోతి

లారీ డ్రైవర్‌పై దాడి నగదు దోపిడీ

దివాన్‌చెరువు హైవేపై ఘటన

దివాన్‌చెరువు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తులు లారీ డ్రైవర్‌ను కొట్టి నగదు దోచుకుపోయిన సంఘటన సోమవారం తెల్లవారుజామున జరిగింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రాజమహేంద్రవరం నుంచి సోలాపూర్ వెళ్తున్న లారీని డ్రైవర్ శ్రీషైన్‌మైత్రీ ఆదివారం అర్ధరాత్రి రెండుగంటల సమయంలో దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్ద రోడ్‌పక్కకు ఆపి డోర్ తెరచి క్యాబిన్‌లో పడుకున్నాడు. తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో బ్యాటరీ బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు నిద్రపోతున్న డ్రైవర్‌ను లేపి ఇష్టానుసారంగా కొట్టారు. అతడి జేబులో ఉన్న రూ.20 వేలు నగదుతో పాటు సెల్‌ఫోన్ తీసుకుని రాజానగరం వైపు పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు బొమ్మూరు ఎస్‌ఐ ఆర్.అంకారావు తెలిపారు.

అర్ధరాత్రి హల్‌చల్...

మత్తులో పోలీసులపై యువకుల దాడి

రాజమహేంద్రవరంలో ఘటన



యువకుల దాడి దృశ్యాలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జనాన్ని రక్షించే పోలీసులకు రక్షణ లేకుండా పోయింది. అందుకు నిదర్శనం ఈ సంఘటనే. మత్తులో యువకులు పోలీసులపై దాడి చేశారు. అసలేం జరిగిందంటే.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ యు.నాగరాజు, హోంగార్డు కేకేకేఎస్‌వీ ప్రసాద్ (కాళి) ఆదివారం రాత్రి నైట్‌బీట్ పహారాలో ఉన్నారు. రాత్రి 12గంటల సమయంలో కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని సోనోవిజన్ సందులోకి వెళ్లగా.. అక్కడ ఓ చోట ముగ్గురు యువకులు ఫూటుగా తాగిన మత్తులో కనిపించారు. వాళ్లలో ఒక యువకుడు బీర్ తాగుతున్నాడు. దీంతో ఎవరు మీరు? ఇక్కడ ఈ టైంలో ఉండకూడదు? తాగేసి ఉన్నారు కదా? ఇళ్లకు వెళ్లిపోండి.. అని పోలీసులు అన్నారు. దీంతో ఆ యువకులు పోలీసులపై తిరగబడ్డారు. సుమారు 20 నిమిషాల పాటు కేకలు వేస్తూ, చేతులు విసురుతూ గలాటా సృష్టించారు. కాని స్టేబుల్ లాఠీని లాక్కున్ని కొట్టారు. యువకుల్లో ఒకడు తాను తాగే బీర్ బాటిల్‌తో తలపై కొట్టుకున్నాడు. చివరికి వాళ్లను అతికష్టంపై స్టేషన్‌కు తీసుకెళ్లారు. వాళ్లను పాత తుంగపాడుకు చెందిన కట్టుంగ హరీశ్, రాజవోలుకు చెందిన కర్రి దుర్గా సూర్య ప్రసన్న, ధవళేశ్వరం ఐవోసీఎల్ కాలనీకి చెందిన ములపర్తి వినోద్‌గా గుర్తించి కేసు నమోదు చేశారు. హరీశ్‌పై రాజా నగరం పోలీస్ స్టేషన్లో రౌడీ షీటు ఉంది. హత్య, హత్యాయత్నం నేరాల్లో నిందితుడిగా ఉన్నాడు. అయితే వారు గంజాయి ఫూటుగా తాగిన మత్తులో పోలీసులపై దాడికి దిగారని తెలుస్తోంది.

అనుమతి మేరకే పొగాకు పండించాలి

బాడవ పొలాల్లో పంట వేయొద్దు : పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతి మేరకే పొగాకు పండించాలని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి అనంతరం పొగాకు బోర్డు కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ రైతులు స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. ఈ ఏడాది పొగాకు పంటకు ప్రారంభంలో ధర రూ.240 ఉండగా క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం కిలో ధర రూ.375 పలుకుతుందన్నారు. ఎన్‌ఎల్‌ఎస్ ఏరియాలో 42మిలియన్ కిలోల అనుమతి ఇవ్వగా అదనంగా 12మిలియన్ కిలోలు ఉత్పత్తి పెరిగిందన్నారు. అంతర్జాతీయంగా భారత దేశంలో పండించే పొగాకుకు గట్టి పోటీ ఉంటుందని ముఖ్యంగా జింబాబ్వే, బ్రెజిల్, ఆఫ్రికా వంటి దేశాల్లో పొగాకు ఉత్పత్తి పెరిగిందన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని పంట నియంత్రణ పాటించాలన్నారు. గతేడాది తుఫాన్ వల్ల రైతులు తీవ్రంగా పంట నష్టపోవడంతో రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, ఏలూరు ఎంపీ పి.మహేశ్ సహకారంతో పొగాకు అదనపు పంటకు పెనాల్టీ లేకుండా వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ ఏడాది అదనపు పంటకు పెనాల్టీ 10-20శాతం వరకు ఉత్పత్తి అయిన పొగాకుకు 2-3శాతం పెనాల్టీ విధించినట్టు ఆయన తెలిపారు. తొర్రేడు రైతులు ఎన్‌ఎల్‌ఎస్‌కు బ్యారన్‌కు 35క్వింటాళ్లు అనుమతి ఇస్తున్నారని, తమకు 21 క్వింటాళ్లే అనుమతి ఇస్తున్నారని, అలాంటి వ్యత్యాసం లేకుండా చూడాలని చైర్మన్‌ను స్థానిక రైతులు కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి పొగాకు బోర్డు సమావేశంలో చర్చించి న్యాయం చేస్తామన్నారు. బాడవ పొలాల్లో పొగాకు పంట వేయొద్దని, అలా వేస్తే బోర్డు చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు కొత్తగా బ్యారన్ లైసెన్సులు ఇవ్వాలని కోరగా ఈ విషయం తన పరిధిలో లేదని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఆర్‌కే ప్రసాద్, దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి హేమస్మిత, పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, కేవీవీ సత్యనారాయణ, పరిమి శ్రీరామకృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, సింహాద్రి ధర్మవతారం, నరహరశెట్టి రాజేంద్రబాబు, బిక్కిన నాగరాజు, నాయుడుదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

స్కానింగ్ సెంటర్ సీజ్

పూర్తి విచారణ చేపట్టాలి : కాకినాడ కలెక్టర్

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఓ స్కానింగ్ సెంటర్‌ను కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం సీజ్ చేశారు. కాకినాడలోని వెంకటేశ్వర స్కానింగ్ సెంటర్‌లో పీసీపీఅండ్‌డీటీ యాక్ట్‌కు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించట్లేదన్న ఆరోపణలపై విచారణ చేపట్టిన డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ బృందం ఆ నివేదికను కలెక్టర్ షాన్‌మోహన్‌కు సమర్పించింది. దాంతో ఆయన ఆదేశానుసారం ఆర్డీవో ఎస్.మల్లిబాబు సమక్షంలో స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేశారు. ఈ స్కానింగ్ సెంటర్‌ను 8 వారాలు సస్పెన్షన్ చేస్తూ ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో పూర్తి విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల యాజమాన్యం పీసీపీఅండ్‌డీటీ యాక్ట్ ప్రకారం నమోదు చేసుకోకపోయినా, సరైన రికార్డులు నిర్వహించకపోయినా, ఫారం ఎఫ్ రిపోర్ట్‌లు డీఎంహెచ్‌వో కి పంపకపోయినా, లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఆడ, మగ అని తెలిపినా పీసీపీఅండ్‌డీటీ యాక్ట్ నిబంధనలు అతిక్రమణగా పరిగణించి తగు చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో నరసింహనాయక్ తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భర్తను అతి కిరాతకంగా ఇనుపరాడ్‌తో తలపై మోది హత్య చేసిన భార్య దొమ్మేటి వెంకటరమణను సోమవారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ నడిపూడి బైపాస్ రోడ్డులో మెట్ల రాంజీ కాలనీలో ఈనెల 4న అర్ధరాత్రి సమయంలో కాకినాడ హెడ్ క్వార్టర్స్ స్క్వాడ్‌లో ఆర్టీసీ బస్సుల తనిఖీ అధికారిగా పనిచేస్తున్న దొమ్మేటి రాంబాబు (61)ని కిరాతకంగా భార్య వెంకటరమణ హత్య చేసింది. దొమ్మేటి నాగసురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. భార్య వెంకటరమణను అరెస్టు చేసి సోమవారం రాత్రి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మరణించిన సూర్యప్రకాష్

గొల్లప్రోలు, సెప్టెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించాడు. పట్టణానికి చెందిన సందిపు సూర్యప్రకాష్ (39) తన స్కూటీపై కాకినాడ బయలుదేరాడు. పట్టణ శివారులోని వెంకటేశ్వర రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మరణించాడు. గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆటో ఢీకొని మహిళ మృతి

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మరణించింది. గ్రామానికి చెందిన ముల్లుల్లి శేషారత్నం (60) రోడ్డు దాటుతుండగా కాకినాడ నుంచి పిఠాపురం వస్తున్న ఆటో ఢీకొని అక్కడిక్కడే మరణించింది. పిఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొల్లప్రోలులో కూలిన ఇంటి పైకప్పు

తప్పిన ప్రమాదం

గొల్లప్రోలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో ఇంటి పైకప్పు కూలిన సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని మార్కండేయపురానికి చెందిన రాపర్తి గనిరాజుకు చెందిన పెంకుటిల్లు పైకప్పు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నానిపోయింది. సోమవారం అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లో సామాన్లు పూర్తిగా పాడయ్యాయని గనిరాజు తెలిపాడు.

ఇదేం వైద్యం?

ఆసుపత్రి ముందు బాధితుల ఆందోళన

కొత్తపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంతంలో ప్రవేటు ఆసుపత్రికి సోమవారం మాయాపట్నంకు చెందిన శాంతిరాజు, పాత పంచాయతీ సమీపంలో నివాసం ఉండే వి వీరకమల్ వేర్వేరు ఇబ్బందులతో వైద్యం చేయించుకోవడానికి వెళ్లారు. వారికి రక్తపరీక్షలు చేయించారు. శాంతి రాజుకు మలేరియా పాజిటివ్, వీరకమల్‌కు మలేరియా పాజిటివ్, పచ్చకామెర్లని రిపోర్టు ఇచ్చారు. ఐదు రోజుల పాటు ఆసుపత్రిలో ఉండి చికిత్స పొందాలని, లేకుంటే చాలా ప్రమాదమని చెప్పడంతో హడలెత్తిపోయారు. వారిద్దరూ వేరే ఆసుపత్రికి వెళ్లగా రక్తపరీక్షలు చేసి వైరల్ జ్వరాలని, మందులు వాడితే సరిపోతుందని వైద్యులు తెలియజేశారు. దీంతో శాంతిరాజు, వీరకమల్ ముందు పరీక్షలు చేయించిన ఆసుపత్రికి చేరుకుని ఆందోళన చేపట్టారు. వైద్యుడిని గట్టిగా నిలదీశారు. తీరప్రాంతాల్లో ప్రవేటు ఆసుపత్రులు, రక్తపరీక్ష కేంద్రాలపై అధికారులు విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని కోరారు.

ఆటోలు, బస్సుల్లో మహిళలే టార్గెట్

● చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి మహిళల అరెస్ట్ ● రూ.2 లక్షల నగదు, 106.5 గ్రాముల బంగారం స్వాధీనం



అన్నవరంలో వివరాలు వెల్లడిస్తున్న ప్రత్తిపాడు సీఐ

అన్నవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే మహిళలే వారి టార్గెట్. వారితో ప్రయాణిస్తూ మాటలతో ఒకరు దృష్టి మరల్చుతారు మరొకరు చాకచాక్యంగా బ్యాగుల్లో విలువైన వస్తువులు, నగదు తస్కరిస్తారు. అలా చోరీలు చేస్తున్న ఇద్దరు మహిళలు అన్నవరం పోలీసులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా గోకవరానికి చెందిన తొండ శాంతి (35), ఆవుల భూలక్ష్మి (38) తోడుదొంగలు. మహిళా ప్రయాణికులే టార్గెట్‌గా అన్నవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు చేశారు. 4 కేసుల్లో నిందితులుగా ఉన్న వారి కోసం పోలీసులు 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా అన్నవరం ఎస్‌ఐ హరిబాబుకు వచ్చిన సమాచారం మేరకు వారిని శంఖవరం కత్తిపూడిలో పట్టుకున్నట్టు ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు తెలిపారు. వారి నుంచి రూ.2 లక్షల నగదు, 106.5 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో మహిళలు ప్రయాణంలో అప్రమత్తతో ఉండాలని కోరారు.

కొత్తకోటపాడులో ప్రబలిన డయేరియా

» నాలుగు కేసుల నమోదు

» వినాయకచవితి ప్రసాదంతో ఫుడ్ పాయిజనింగ్ : అధికారులు

» నియంత్రణలో పరిస్థితి : డీఎంఅండ్‌హెచ్‌వో



గ్రామంలో బాధితుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

రంగంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం కొత్త కోటపాడులో నాలుగు డయేరియా కేసులు నమోదు కావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సోమవారం డయేరియా కేసులు నమోదు కావడంతో విషయాన్ని డీఎంఅండ్‌హెచ్‌వోకి తెలియజేయడంతో వెంటనే డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా సర్వేలెన్స్ అధికారి, ఎపిడెమియాలజిస్ట్, జిల్లా బృందం, ఫుడ్ ఇన్స్పెక్టర్ కొత్త కోటపాడు వచ్చి నమోదైన డయేరియా కేసులను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. రంగంపేట పీహెచ్‌సీ, ప్రత్యేక డాక్టర్ల బృందంతో మెడికల్ క్యాంప్ నిర్వహించి బాధితులకు చికిత్స అందించారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, పర్యవేక్షక సిబ్బంది ఇళ్ల దగ్గరకు వెళ్లి కేసులపై విచారణ జరిపారు. అలాగే నీటి, మల నమూనాలను సేకరించి పరిశీలన కొనసాగుతుంది. పరిస్థితి నియంత్రణలో ఉందని డీఎంఅండ్‌హెచ్‌వో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. వినాయక చవితి ప్రసాదం పులిహోర తినడంతో అది ఫుడ్‌పాయిజనింగ్ కారణంగానే డయేరియా వచ్చి ఉండవచ్చని వైద్యాధికారులు తెలిపారు. ఇదే నిజమైతే డయేరియా కేసులు ఇంకా పెరగొచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. అలాగే కొత్తకోటపాడు, పాత కోటపాడు గ్రామస్తులు కొత్త నాయకంపల్లిలో ఉన్న నూతినీటిని తాగుతారని తెలపడంతో ఆ నీటి నమూనాలను కూడా సేకరించారని తెలిపారు. గ్రామంలో కేసులు నమోదైన ఇళ్ల దగ్గర పరిసరాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ప్రజలకు డయేరియాపై ఆరోగ్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. నాయకంపల్లిలో ఉన్న నుయ్యి కూడా అపరిశుభ్రంగా ఉందని కొందరు గ్రామస్తులు చెప్తున్నారు.

కాకినాడలో కారు బీభత్సం

అదుపు తప్పి దూసుకెళ్లడంతో ఇద్దరికి గాయాలు



దెబ్బతిన్న కారు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. వివరాలిలా ఉన్నాయి. మురళీ అనే వ్యక్తికి సంబంధించిన కొత్త కారు స్థానిక ప్రతాప్‌నగర్ బ్రిడ్జి నుంచి గాంధీనగర్ వైపు వస్తూ ఉండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పింది. ఈ క్రమంలో రోడ్డుపక్కన ఉన్న చిన్న చిన్న షాపులు, పార్క్ చేసి ఉన్న ద్విచక్రవాహనాలపైకి దూసుకెళ్లింది. దీంతో రోడ్డు పక్కన వ్యాపారం చేస్తున్న తోపుడు బండ్ల సామానులన్నీ చెల్లాచెదురయ్యాయి. అదేవిధంగా అదే ప్రాంతానికి చెందిన పాలకూరి శ్రీనివాసరావు అనే 71 ఏళ్ల వృద్ధుడు, కడలి వెంకటనారాయణ గాయాల పాలయ్యారు. అది గమనించిన స్థానికులు క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి కిడ్నాప్?

కత్తులతో బెదిరించి కారులో తీసుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



మతిస్థిమితం లేని వృద్ధురాలు (ఫైల్)

చింతూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వృద్ధురాలిని గుర్తుతెలియని వ్యక్తులు కారులో తీసుకెళ్లిపోయారు. అల్లూరి జిల్లా చింతూరుతో పాటు సమీప గ్రామాల్లో 12 ఏళ్లుగా ఓ వృద్ధురాలు సంచరిస్తూ జీవనం గడుపుతోంది. ఆకలి అవుతున్నపుడు హోటళ్ల వద్దకు వెళ్తుంటుంది. వారు ఓ ముద్ద అన్నం పెడుతుంటారు. కాగా ఇటీవల ఆమె చింతూరుకు పది కిలోమీటర్ల దూరంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న తుమ్మల వెళ్లింది. ఆదివారం రాత్రి కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి వృద్ధురాలిని బంధించి తీసుకెళ్లినట్టు గ్రామస్తులు పేర్కొన్నారు. బంధించి కారులో ఎక్కిస్తుండగా అడ్డుకునే ప్రయత్నం చేశామని, కానీ ఆ గుర్తుతెలియని వ్యక్తులు తమను కత్తులతో బెదిరించడంతో చేసేదేమీ లేక మిన్నకుండి పోయామని వారు చెప్పారు.

రంపచోడవరం నూతన ఐటీడీఏ పీవో బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏ నూతన ప్రాజెక్టు అధికారి స్మరణ్‌రాజ్ సోమవారం ఏఎస్ఆర్ జిల్లా కేంద్రం పాడేరులో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఐటీడీఏ పీవోగా బాధ్యతలు నిర్వహించిన కట్టా సింహాచలం రిలీవ్ అయ్యారు. కాగా నూతన ఐటీడీఏ పీవో స్మరణరాజ్ సోమవారం పాడేరులో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన పీవో స్మరణ్‌రాజ్ అక్కడే ఐటీడీఏ పీవో బాధ్యతలు స్వీకరించినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాగా ఢిల్లీలో జరగనున్న రెండు రోజులు కాన్ఫరెన్స్‌కు నూతన పీవో బయలుదేరి వెళ్లినట్టు సమాచారం. మరో మూడు రోజుల తర్వాత నూతన పీవో రంపచోడవరం వస్తారని అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయుడి అదృశ్యంపై ఫిర్యాదు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం వడ్డిగూడెంలో వైదాని వెంకటరమణప్రసాద్ (52) కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ముమ్మిడివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటరమణప్రసాద్ ఈ నెల 6 వ తేదీ ఉదయం ఇంటిన ఉంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజుల పాటు ప్రసాద్ ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ప్రయోజనం లేదు. దాంతో సోమవారం ఉపాధ్యాయుడు ప్రసాద్ భార్య నాగవెంకటవిజయలక్ష్మి అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు.

విధుల్లో స్పృహ తప్పిన హెడ్ కానిస్టేబుల్

కైకలూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కైకలూరులో జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో బందోబస్తు నిర్వహించేందుకు వచ్చిన పోలీసు అనారోగ్యానికి గురయ్యాడు. సోమవారం కైకలూరు కరకట్ట వద్ద కాకినాడ 3వ బెటాలియన్‌కు చెందిన ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుల్ డి.అశోక్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఆకస్మికంగా స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో స్థానిక పోలీసులు హుటాహుటిన కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌కుమార్

కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌కు 14 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి 14 అర్జీలు వచ్చినట్టు కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుల్లో ఇంజనీరింగ్ విభాగానికి 9, టౌన్ ప్లానింగ్‌కు 1, రెవెన్యూ 1, పబ్లిక్ హెల్త్‌కి 2, వార్డు సచివాలయాలకు 1 అర్జీ వచ్చినట్టు చెప్పారు. ప్రతి అర్జీపై సమగ్ర విచారణ చేసి అర్జీదారుని సంతృప్తి లక్ష్యంగా చిత్తశుద్ధితో పరిష్కారం చూపాలన్నారు. అనంతరం టెలికాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ సిబ్బందితో మాట్లాడి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై ఆరా తీశారు. వీటిని త్వరగా పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి హోమియో వైద్యులతో సమీక్ష నిర్వహించారు. మందుల నిల్వలు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలు అవుట్‌పేషెంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిధిలోని ప్రత్యేక పాఠశాలల విద్యార్థులకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

రాజమహేంద్రవరంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియాను సరఫరా చేయడంలోను, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడంలోను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు విమర్శించారు. సోమవారం రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించకపోవడం శోచనీయమని, స కాలంలో ఎరువులు అందించలేకపోవడం దారుణమన్నారు. జిల్లాలో యూరియా కోసం రైతులు ఆందోళన చేస్తున్నా వ్యవసాయశాఖ మంత్రికి కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ప్రతి రైతుకు రూ.20,000 సాగు సాయం తక్షణం విడుదల చేయాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్-అక్షరాంధ్రపై శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని మెప్మా పాత కార్యాలయంలో సోమవారం ఉల్లాస్-అక్షర ఆంధ్రపై వలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కనకరాజు విచ్చేశారు. మహిళలు చదువుకుంటే పిల్లల భవిష్యత్ చక్కగా వుంటుందన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో 100శాతం వయోజన ప్రాథమిక అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. శిక్షణ అనంతరం టీచర్లకు బోధన పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో సీఎంఎం వి.రామలక్ష్మి, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ ఎం.పణికుమార్, పి.శ్రీదేవి, టీఎంసీ సాయికుమార్, రిసోర్స్‌పర్సన్ పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన జీవీ రమణ



మంత్రి దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన రాజా సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, శ్రీ జ్ఞాన సరస్వతి పీఠం వ్యవస్థాపకుడు ఈతలపాటి సుబ్బారావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ నాటక అకాడమీ డైరెక్టర్‌గా జనసేన కోటాలో నియమితులైన రమణ తప్పకుండా తమ పదవికి వన్నె తేగలరని ఆకాంక్ష వ్యక్తం చేశారు. త్వరలో నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణను కలిసి భవిష్యత్ కార్యాచరణపై చర్చిద్దామని మంత్రి చెప్పారు.

ప్రత్యేక అవసరాల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



అభివృద్ధి పనులకు ప్లాన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు, ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, భవిత సెంటర్లకు విద్యార్థులు రావడానికి ఎస్కార్ట్ అలవెన్స్, ట్రావెలింగ్ అలవెన్స్‌లను రూ.6 వేలు చేసిందన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. సోమవారం స్థానిక దానవాయిపేట కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సిటీ నియోజకవర్గం పరిధిలో ఏర్పాటు చేసిన దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ వైద్యశిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. జీవితంలో ఎదగడానికి వైకల్యం అడ్డంకి కాకూడదన్నారు. నగరంలో 180 మంది దివ్యాంగులున్నారని భవిత సెంటర్లలో ఇద్దరు బ అర్హులు ఉన్నచోట మరో ఇద్దరిని డిప్యూటేషన్‌పై వేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఈ శిబిరంలో అలింకో కంపెనీ ఏ విద్యార్థికి ఏ ఉపకరణం అవసరమో నిర్ధారిస్తుందని,దానికి అనుగుణంగా ప్రభుత్వం ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేస్తుందన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

రాజమహేంద్రవరం 1వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వాసు శ్రీకారం చుట్టారు.

ఉపకరణాల నిర్ధారణ శిబిరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి స్థానిక శ్రీరాంపురం రోడ్డులో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల తదితర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కూటమి అధికారంలోకి వచ్చాక నగరంలో రూ.250 కోట్ల పనులు జరుగుతున్నాయంటే ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. 2027లో జరిగే పుష్కరాల నాటికి రాజమండ్రి రూపురేఖలు మారిపోయే స్థాయిలో అభివృద్ధి పనులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, కూటమి నాయకులు మజ్జి రాంబాబు, కదిరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శాటిలైట్‌సిటీ జడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు డి.రాముడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకున్న సందర్భంగా పాఠశాల కమిటీ సభ్యులు, సహచర ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా రాముడు చేసిన సేవలు అమూల్యమైనవని పలువురు కొనియాడారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా చిలుకూరి

కార్యదర్శిగా వసంతరావు

కడియం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞానవేదిక (జేవీవీ) జిల్లా సంఘం ఉపాధ్యక్షుడిగా చిలుకూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా నాయపాటి తేరాటి వసంతరావు ఎంపికయ్యారు. రాజమహేంద్రవరం యూటీఎఫ్ హాల్‌లో జరిగిన జేవీవీ సమావేశానికి మాజీ ఎంపీ మిడియం బాబూరావు విచ్చేశారు. మూఢ దురాచారాలుగా మూడనమ్మకాల దుష్ప్రభావాలను, సాంకేతిక దుశ్చర్యలను ప్రచారం చేస్తున్న వీరిద్దరికీ జిల్లా కమిటీలో చోటు కల్పించారు. మండలంలోని వెంకయ్యపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సాకా అనిత కార్యవర్గ సభ్యురాలిగా ఎంపికయ్యారు. ఎంపికైన వారికి డాక్టర్ గుర్రాల వెంకట్రావు, తమ్మిశెట్టి ప్రసాద్‌లు అభినందనలు తెలిపారు.

వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

ఎంపీపీ ప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మాధురి

కడియం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తోందని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అన్నారు. సోమవారం కడియం మండల పరిషత్ కార్యాలయంలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.ఆసుపత్రుల్లో ప్రభుత్వం అనేక రకాల వైద్యసదుపాయాలను కల్పించిందని, వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పేదలకు వైద్యసేవలందించాలన్నారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ మాధురి మాట్లాడుతూ రోగులకు ఎప్పటికప్పుడు సమయంలో చేయాల్సిన ఇంజక్షన్లు, గర్భిణులకు టీకాలు, స్కానింగ్ వంటి సేవలందిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, ఎంపీడీవో కె.రమేష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చిలుకూరి ప్రభ, సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జ్యోత్స్న, జెస్సీ, మౌర్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బీమా వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) 69వ వార్షికోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజరు సత్యనారాయణ సాహు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత వారోత్సవాల సందర్భంగా చేపట్టిన వివిధ కార్యక్రమాలపై వీడియో ప్రజెంటేషన్ చేశారు. అనంతరం సాహు మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రజల సొమ్ము ప్రజల సంక్షేమానికి వెచ్చిస్తోందన్నారు. ప్రస్తుత తరానికి చెందిన యువత దేశానికి, సమాజానికి అవసరమైన వృత్తులను చేపట్టి ముందుకు నడపాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కలరింగ్, డ్రాయింగ్, సింగింగ్, క్విజ్ పోటీల్లో 14 పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజరు వెంకటేశ్వర్లు, రెడ్డి, నాగశ్రీదేవి,పూర్ణచంద్రరావు, సుబ్రహ్మణ్యం, వీర కిషోర్, గన్నయ్య, కోదండరాం, విశ్వనాథ్, ఈశ్వరరావు,కిరీష్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన సంఘ సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తేజోమూర్తుల నరసింహమూర్తిని, బ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు మాచిరాజు శ్రీనివాస్, రాజమండ్రి బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ మేనేజర్ కె.నాగభూషణం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. జనసేన పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న తేజోమూర్తులకు సరైన గౌరవం దక్కిందని వారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు, వారి సేవా కార్యక్రమాలను అందించాలని విన్నవించారు.

కూల్చివేత వ్యర్థాల సేకరణ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్మాణాల కూల్చివేత వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు స్థానిక 16వ డివిజన్‌లో 10ఎకరాల 52సెంట్ల స్థలం కేటాయింపు ప్రతిపాదనలపై ప్రజలకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలియజేసేందుకు వారం రోజుల పాటు అభ్యర్థనలు స్వీకరణ నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.నగరంలో భవనాలు కూల్చివేసినప్పుడు వాటిని ప్రాసెసింగ్ చేసేందుకు ముందు తాత్కాలికంగా నిల్వ చేయడానికి (సీఅండ్‌డీ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్)ను రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట పంచాయతీ పరిధిలో 16వ డివిజన్‌లో ఆర్ఎస్‌నెం 24లో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామన్నారు. ఈ ప్రతిపాదనపై ప్రజలకు సలహాలు, సూచనలు, అభ్యంతరాలుంటే 7 రోజుల్లో నగరపాలక సంస్థ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అందజేయాలని ప్రశాంతి పేర్కొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం షాలిని

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మండలంలోని కొంతమూరులో ఈపీఆర్ ఎయిడెడ్ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్న లక్ష్మీ శ్రీసాయి ప్రతిభ కనబరిచింది. సాయి ఏపీ రాష్ట్ర సబ్ జూనియర్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికై ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌లో గత నెల 25, 30 తేదీల్లో జరిగిన చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనపరిచింది. ఈ సందర్భంగా పాఠశాల క్రీడా సంఘం నిర్వహించిన కార్యక్రమంలో సాయిని సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ కె.ప్రభాకరరావు, హెచ్ఎం వి.షాలిని సౌజన్య, పీఈటీ సయ్యద్ షఫీ, ఉపాధ్యాయులు అభినందించారు.



విశ్వవోలు గోలింగేశ్వరస్వామి ఆలయాన్ని శుద్ధి చేస్తున్న సిబ్బంది

ఆలయాల సంప్రోక్షణ

బిక్కవోలు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను చంద్రగ్రహణం అనంతరం సోమవారం ఉదయం సంప్రోక్షణ చేశారు. ఇందులో భాగంగా గోలింగేశ్వర, శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీలక్ష్మి జనతి ఆలయాలను సంప్రోక్షణ చేశారు. ఉదయం పది గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించామని ఆలయాల ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు.

బాల్యం నుంచే గురువులను గౌరవించడం అలవర్చుకోవాలి

రంగంపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే గురువులను గౌరవించడం అలవర్చుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంట రమణబాబు కోరారు. సోమవారం చండ్రేడు హైస్కూల్లో నిర్వహించిన గురు పూజోత్సవానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ముందుగా సర్వేపల్లి చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రమణబాబుతో పాటు ఉపాధ్యాయులు శివ రామకృష్ణ, మాణిక్యాలరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, వీరబాబు, సత్యనారాయణమూర్తి, సీతామహాలక్ష్మి, నాగలక్ష్మిలను విద్యార్థులు సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు.

అనపర్తి విద్యార్థినికి బాల్ బ్యాడ్మింటన్‌లో తృతీయస్థానం



అనపర్తి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీబీఆర్ ప్రభుత్వం జిల్లా చేస్తూ లోని శ్రీరామ దూత స్వామి ఆశ్రమ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన 10వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ అండర్ 14గర్ల్స్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో అనపర్తి జీబీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని అనుమోలు దివ్యశ్రీ ప్రతిభ కనబరచి తృతీయస్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల డీన్ హరిప్రసాద్ విద్యార్థినిని అభినందించారు. వీరితో హెచ్ఎమ్ రామారావు, భువనేశ్వరి, కామాక్షి, వెంకటరెడ్డి, ప్రశాంతిరెడ్డి, గేమ్స్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉమా మహేశ్వరిదేవిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఉమామహేశ్వరిదేవికి పలువురు అభినందనలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నన్నయ ప్రొఫెసర్ ఉమామహేశ్వరిదేవి తన బాధ్యతలను త్రికరణ శుద్ధిగా నిర్వహిస్తారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఆమె అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు ఆమెను అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆమెను సన్మానించి జ్ఞాపిక అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, విభాగాధిపతి ఆచార్య ఎస్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణబాబుకి మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఆర్ట్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ కళాశాల నుంచి ఎస్.కృష్ణబాబు పీహెచ్‌డీ పూర్తి చేశారు. విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకి పీహెచ్‌డీ అవార్డు కాపీని వీసీ అందజేశారు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి మార్గదర్శకంలో పూర్తి చేశారని వక్తలు తెలిపారు. నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, పరిశోధనాభివృద్ధి విభాగం డీన్ పీవీ జయ నిర్మల తదితరులు కృష్ణబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



రామవరంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వీర్రాఘవరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలుగు వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేస్తున్న కుతుకులూరు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సత్తిన వీర రామవరపు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ముఖ్యమంత్రి నుంచి అవార్డు అందుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రామవరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా దుశ్శాలువా కప్పి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి ఆయన వన్నె తెచ్చారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి, డీసీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా బోధన సాగాలి

ఎమ్ఈవో సత్తిరెడ్డి, క్లస్టర్ హెచ్ఎమ్ విజయభారతి

అనపర్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా విద్యా బోధన సాగాలని అనపర్తి ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, క్లస్టర్ హెచ్ఎమ్ విజయభారతి అన్నారు. సోమవారం రామవరం పులగుర్త ఉన్నత పాఠశాలలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వంటి పలు అంశాలను వారు పరిశీలించారు. హెచ్ఎమ్ సీతామహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎపీఏ వన్ పరీక్షలలో టాపర్స్‌కి, క్లాసు లీడర్లకు గుర్తింపు బ్యాడ్జీలను అందజేశారు. ఉపాధ్యాయుల సమావేశంలో ఎమ్ఈవో మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పనిచేసి ఎప్పటికప్పుడు లోపాలను సరిదిద్దుకోవాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.



పులగుర్త ఉన్నత పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎమ్ఈవో సత్తిరెడ్డి, క్లస్టర్ హెచ్ఎమ్ విజయభారతి

ఆళ్ల బ్రదర్స్‌కు పలువురు పరామర్శ

రంగంపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద తల్లి ఐజీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం పెదితలోని జీఎస్ఎల్ సంస్థ అధినేత గన్ని భాస్కరరావు, మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, రంగంపేట హైస్కూల్ హెచ్ఎం వి.ప్రసాదరెడ్డి, ఉపాధ్యాయులు, పలువురు కూటమి నాయకులు, గ్రామస్తులు ఆళ్ల సీతారాములు, ఆళ్ల బ్రదర్స్ సత్యనారాయణ, వీరవెంకటరామకృష్ణ, గోవిందులను పరామర్శించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై 15 నుంచి రణభేరి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా రంగ సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యల పరిష్కారం కోరుతూ 15వ తేదీ నుంచి 19 వరకు యూటీఎఫ్ రణభేరి చేపట్టిందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.శరీఫ్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టరును సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు ప్రాంతాల నుంచి రణభేరి జాతాలు మొదలవుతాయన్నారు. అన్ని ప్రాంతాల్లో ఐదురోజులపాటు ఈ జాతాలు పర్యటిస్తాయన్నారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ దయానిధి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం 15 నెలలు కావస్తున్నా వాటి ఊసెత్తడంలేదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఐ.రాజేశ్వరి, మాజీ అధ్యక్షుడు శ్రీనుబాబు పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మండల కార్యదర్శి పణికుమార్, నాయకులు విజయబాబు, అనిల్‌కుమార్, ఇస్మాయిల్, ఉషశ్రీ, నాగేశ్వరరావు, దుర్గారావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక ప్రగతిలో ఎల్ఐసీ కీలకం

కొవ్వూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక ప్రగతిలో ఎల్ఐసీ పాత్ర మరువలేనిదని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం ఎల్ఐసీ కార్యాలయంలో మేనేజర్ ఎస్.శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన బీమా వారోత్సవాల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి క్విజ్‌లో గెలుపొందిన హైస్కూల్ విద్యార్థులకు, ఎల్ఐసీ ఏజెంట్లు, ఆఫీసు సిబ్బందికి బహుమతులు అందజేశారు. మేనేజర్ శ్రీరామ్ మాట్లాడుతూ పొదుపును సేకరించి జీవిత బీమా వ్యాపారం చేయడంలో ఇప్పటికీ ఎల్ఐసీ ముందంజలోనే ఉందని, దానికి నిదర్శనం షేర్ మార్కెట్ అధికంగా ఉండడమేనన్నారు.



గోకవరం సొసైటీ వద్ద యూరియా వినియోగంపై సూచనలు ఇస్తున్న డీసీవో, జిల్లా వ్యవసాయాధికారి

యూరియా కోసం ఆందోళన చెందవద్దు

గోకవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా సహకార అధికారి(డీసీవో) ఎం.వెంకటరమణ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. గోకవరం సొసైటీ వద్ద జరుగుతున్న ఎరువుల పంపిణీని సోమవారం వారు పరిశీలించారు. యూరియా కోసం సొసైటీ వద్దకు చేరుకున్న రైతులతో వారు మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. నానో యూరియాను వినియోగించడం వల్ల లాభాలు కలుగుతాయన్నారు. ఎరువుల పంపిణీపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట సొసైటీ సీఈవో డి.సురేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సాగిన శ్రీలక్ష్మీగణపతిస్వామి ఊరేగింపు



దివాన్‌చెరువులో జరిగిన లక్ష్మీగణపతి ఊరేగింపు దృశ్యం

దివాన్‌చెరువు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులో జరుగుతున్న శ్రీలక్ష్మీగణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా స్వామివారి ఊరేగింపు సోమవారం కన్నుల పండువగా సాగింది. మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద నుంచి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ఊరేగింపు ప్రారంభించారు. బాణా భజంత్రీలు, కోయడాన్సులు, వెంకన్నబాబు కర్రసాము వంటి కార్యక్రమాల మధ్య గ్రామంలోని ఆయా వీధుల్లో స్వామివారిని ఊరేగించి తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానంలో స్థానికులతోపాటు పలు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు.

వ్యాన్‌ను ఢీకొన్న బైక్.. ఇద్దరికి గాయాలు

కొవ్వూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యాన్‌ను బైక్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడినట్టు కొవ్వూరు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.జగన్నాథదాస్ తెలిపారు. ఏలూరుకు చెందిన ఫ్యూజన్ ఫోర్స్ డిజిటల్ మార్కెటింగ్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న షేక్ బషీర్ ద్దీన్, స్నేహితుడు కావలరపు సుమంత్‌తో కలిసి కంపెనీ పనిమీద సోమవారం ఉదయం బైక్‌పై రాజమహేంద్రవరం బయలుదేరారు.కొవ్వూరు మండలం కాపవరం జియో పెట్రోల్ బంకు సమీపంలో ముందు వెళ్తున్న వ్యాన్‌ను సడన్‌గా ఆపడంతో వ్యాన్‌ను ఢీకొని ఇద్దరూ కింద పడిపోయారు. దీంతో గాయాలయ్యాయి. ఇద్దరిని స్థానికులు రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం, బషీరుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ పేర్కొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేయాలి : కలెక్టర్



రాజమహేంద్రవరంరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కంది పంటకు సరైన మార్కెట్ ధర లభించడం లేదనే రైతుల ఆందోళన దృష్ట్యా ఉత్పత్తి సరఫరా మార్కెటింగ్ వ్యవస్థలో సమతుల్యతను తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు అవసరమని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో ఉద్యాన, మార్కెటింగ్ అధికారులు,శాస్త్రవేత్తలు, మైక్రో ఇరిగేషన్ నిపుణులు, రైతులు వ్యాపార వర్గాల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఒకే పంటను వరుసగా పండించడం వల్ల ధరలు పడిపోవడం, మార్కెట్ ఒడిదొడుకులు రావడం వంటి సమస్యలు వస్తాయన్నారు. రైతుల ఉత్పత్తులను ఎఫ్‌పీవో పరిధిలోకి తీసుకురావడం ద్వారా గ్రేడింగ్, ప్యాకేజింగ్, డిమాండ్ ఉన్న మార్కెట్లకు సరుకుల పంపిణీ సులభతర మవుతుందన్నారు. నిల్వ ఉండని కూరగాయలను మార్కెటింగ్‌లో గ్రేడింగ్ సిస్టమ్ ప్రవేశపెట్టి వాటికి తగిన ధర రాబట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒక పంటకు రేటు బాగా పెరిగాయని అదే పంటను తిరిగి పెద్ద ఎత్తున సాగు చేస్తే డిమాండ్ తగ్గి రైతులు నష్టపోయే అవకాశం ఉందని రైతులు వాపోయారు.కార్యక్రమంలో జిల్లా హార్టీకల్చర్ అధికారి మల్లికార్జునరావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు

పీజీఆర్ఎస్‌లో 184 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్ ,సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అలసత్వం వద్దని జేసీ వై.మేఘస్వరూప్ జిల్లా అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మీమీ స్థాయిల్లో పరిష్కారం లభించే వాటి విషయంలో అలక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంతృప్తికర పరిష్కారం లేకపోవడం వల్లే ఫిర్యాదులు మళ్లీ రీ ఓపెన్ అవుతున్నాయన్నారు. సోమవారం 184 అర్జీలు వచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌వో టీ సీతారామమూర్తి, డీఎల్‌డీవో పి.వీణాదేవి, ముఖ్యప్రణాళిక జాయింట్ డైరెక్టర్ ఎల్.అప్పల కొండ,డీఎస్పీ బి.విద్య పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న జేసీ మేఘస్వరూప్



ఇరుకు సందులో అర్జీదారుల క్యూ

4 కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నాలుగు కార్పొరేషన్లకు డైరెక్టర్లను ప్రకటించింది.ఏపి రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా రాజోలు నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకుడు ముదునూరి వేణుగోపాలకృష్ణరాజు, ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకుడు వెన్నా ఈశ్వరుడును ఎంపిక చేశారు. రాష్ట్ర బ్యాక్ వర్డ్ క్లాసెస్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజోలు నుంచి జనసేన నాయకుడు గుబ్బల ఫణికుమార్‌ను ఎంపిక చేశారు. ఏపీ కమ్మ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా గోపాలపురం నుంచి టీడీపీ నాయకుడు లంక సత్యనారాయణ, జగ్గంపేట నుం చి టీడీపీ నాయకుడు పోతుల వెంకన్నచౌదరి (మోహనరావు),మండపేట నుంచి జనసేన నాయకుడు మేక సూర్యభాస్కరరావు, రాజానగరం నుంచి టీడీపీ నాయకుడు అడుసుమిల్లి శ్రీనివాస వెంకట రామారావు చౌదరి లను ప్రకటించారు. ఏపి స్టేట్ నూర్ బాషా /దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్లుగా ప్రత్తిపాడు నుంచి టీడీపీ నాయకుడు షూకూర్ షేక్, రంపచోడవరం నుంచి టీడీపీ నాయకుడు షేక్ సుభాన్, రాజమండ్రి నుంచి జనసేన నాయకుడు షేక్ బాషా లిమ్రాలను ప్రకటించారు.



బార్లా తెరిచినా!

నో చీర్స్ - బార్ల దరఖాస్తులకు వెనుకంజ

- ఎక్సయిజ్‌శాఖ నానా తంటాలు
- రెండోసారి బార్ల దరఖాస్తులకు పాట్లు
- మద్యం వ్యాపారులపై అదేపనిగా ఒత్తిళ్లు
- దరఖాస్తులు చేసి తీరాలని మీటింగ్‌లు
- లేదంటే దాడులు తప్పవని హెచ్చరికలు
- 14 వరకు దరఖాస్తు గడువు..15న లాటరీ
- అధికారుల్లో బదిలీ భయం

(కాకినాడ/రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో బార్ల లైసెన్సులకు దరఖాస్తులు రప్పించడం కోసం ఎక్సైజ్‌శాఖ తంటాలు పడుతోంది. తొలిసారి పిలిచిన బార్లకు స్పందన రాకపోవడంతో రెండోసారైనా ఫలితం వచ్చేలా చేయడానికి తెగ ప్రయత్నిస్తోంది. ఉన్నతాధికారుల ఒత్తిళ్లు ఎక్కువగా ఉండడంతో ఎలాగైనా పని పూర్తయ్యేలా చేయడం కోసం తమ అధికారాలకు సైతం పదును పెడుతున్నారు. కొందరు మద్యం వ్యాపారులకు కబుర్లు పంపి బార్లను దక్కించుకోవాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. సిండికేట్లతో మాట్లాడుకుని అయినా నలుగురూ కలిపి ముందుకు రావాలంటూ ఆదేశాలిస్తున్నారు. లేదంటే ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బెల్ట్ కేసులు తప్పవంటూ పరోక్ష హెచ్చరికలు చేస్తున్నారు. పాత బార్ల నిర్వాహకులను పిలిచి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.బార్లను దక్కించుకుంటే సహకరిస్తామని భరోసా ఇస్తున్నారు. ఇంత చేసినా ఈ నెల 14 నాటికి అనుకున్న ఫలితం వస్తుందో రాదోనన్న బెంగ వీరిని వేధిస్తోంది.



అధికారుల ఒత్తిడి..

ఎలాగైనా అన్ని బార్లకు నాలుగేసి చొప్పున దరఖాస్తులు పడేలా చేయడానికి రకరకాల వ్యూహాలు అమలు చేస్తున్నారు. చాలా మంది తమకు ఆసక్తి లేదని అధికారులకు తెగేసి చెప్పేస్తున్నారు. ఇప్పటికే మద్యం దుకాణాలతో రాబడి లేక ఇబ్బంది పడుతున్నామని, ఒక్కో దరఖాస్తుకు రూ.5లక్షల నాన్‌రిఫండబుల్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేయలేమని చెబుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు రెండోసారి డ్రా సమయానికి దరఖాస్తులు వచ్చేలా కనిపించకపోవడంతో ఎక్సయిజ్ అధికారులు పరోక్ష హెచ్చరికలకు దిగుతున్నారు. దీంతో కొందరు వ్యాపారులు దారికి వస్తుండగా.. మరికొందరు ఏం చేయలేమని తెగేసి చెప్పేస్తున్నారు. ప్రధానంగా కాకినాడ, రాజమండ్రి, అమలాపురం ప్రాంతాల్లో బార్ లైసెన్స్ ఫీజులు భారీగా ఉండడంతో అసలు వ్యాపారులు దరఖాస్తులు చేయడానికి ముందుకు రావడంలేదు.14లోపు అన్ని బార్లకు దరఖాస్తులు వచ్చేలా చేసే బాధ్యత పైఅధికారులు తమకు అప్పగించడంతో ఈపని ఎలా పూర్తి చేయాలో తెలియక ఎక్సయిజ్ అధికారులు తంటాలు పడుతున్నారు.అయితే ఈసారి కూడా వ్యాపారస్తులు సారీ అంటున్నారు. ఈ టార్గెట్ పూర్తిచేయకపోతే ఎక్కడ బదిలీ వేటు పడుతుందోనని కొందరు సీఐలు హడలిపోతున్నారు.మొదటి నోటిఫికేషన్‌కి అధికారుల బెదిరింపులు తట్టుకోలేక కొందరు దరఖాస్తులు సమర్పించారు. కేవలం ఇప్పటి వరకూ వ్యాపారం చేసిన చోటు పోతుందని ప్రస్తుత వ్యాపారస్తులు కొందరు దరఖాస్తులు సమర్పించడానికి సిద్ధం అవుతున్నారు.ఇప్పటికే పాత బార్ల వద్ద 16 నుంచి పునఃప్రారంభిస్తామని బోర్డులు పెట్టడం అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మరో వైపు బార్ వ్యాపారస్తుల్లో అంతర్గతంగా పోటీ ఎక్కువ కావడంతో స్థలం, షాపుల అద్దెలు ఆయా యజమానులు భారీగా పెంచేశారు.

53కి 15 లైసెన్స్‌లు..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేటాయించిన బార్లకు లైసెన్స్ గడువు ముగియడంతో అధికారులు ఇటీవల కొత్తగా బార్‌పాలసీ ప్రకటించారు. బార్లకు వేలం విధానం ఎత్తివేసి కొత్తగా లాటరీ విధానం ప్రవేశపెట్టారు. ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని నిబంధన విధించారు. ఒక్కో దరఖాస్తుకు రూ.5 లక్షల ఫీజు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో జనరల్, కల్లుగీత కార్మికులకు కలిపి మొత్తం 53 బార్లకు ఆగస్టు 18న గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఒక్కో బార్‌కు దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు, లైసెన్స్ ఫీజు ఏరియా ఆధారంగా రూ.55 లక్షల వరకు నిర్ణయించారు. 2025 నుంచి 2028 వరకు బార్ లైసెన్స్ కొనసాగుతుందని ప్రకటించారు. వేలం విధానానికి బదులు డ్రా తీసే విధానం అమల్లోకి తేవడంతో భారీ ఎత్తున వ్యాపారుల నుంచి పోటీ ఉంటుందని అధికారులు భావించారు. తీరా మొత్తం వ్యూహం బెడిసికొట్టింది. గత నెల 26 నాటికి దరఖాస్తుల గడువు ముగియగా వచ్చిన అప్లికేషన్లు సున్నా. దీంతో అప్పటికప్పుడు దరఖాస్తుల గడువు ఆగస్టు 29వ తేదీ వరకు పొడిగించారు. తీరా రెండో సారి గడువు ఇచ్చినా దరఖాస్తుదారులు పెద్దగా రాలేదు. దీంతో గత నెల 30న బార్లకు డ్రా తీయగా అధికారులు షాక్ తిన్నారు. కాకినాడ జిల్లాలో మొత్తం 17 బార్లకు నోటిఫికేషన్ ఇస్తే కేవలం ఐదు బార్లకు మాత్రమే నాలుగు చొప్పున దరఖాస్తులు రాగా వాటిని వ్యాపారులకు కేటాయించారు. కోనసీమ జిల్లాలో 11 బార్లకు నోటిఫికేషన్ జారీ చేయగా ఒక బారుకు మాత్రమే దరఖాస్తులు రావడంతో కేటాయించారు. తూర్పుగోదావరి జిల్లాలో 25 బార్లకు కేవలం 9 బార్లకు మాత్రమే లైసెన్స్‌లు కేటాయించారు. ఒకరకంగా చెప్పాలంటే ఉమ్మడి జిల్లాలో మొత్తం 53 బార్లకు డ్రా తీయాల్సి ఉంటే కేవలం 15 మాత్రమే డ్రా పూర్తి చేసుకున్నాయి.మిగిలిన బార్లకు చేసేదిలేక రద్దు చేశారు.

38 బార్లకూ..రెండో సారీ..!

మిగిలిన 38 బార్లకు తిరిగి డ్రా తీయడం కోసం ఎక్సైజ్ శాఖ ఈ నెల 3న మళ్లీ రెండోసారి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. వ్యాపారులంతా దరఖాస్తులు చేసుకోవాలని కోరింది. ఈ నెల 14న సాయంత్రం 6 గంటల వరకు వ్యాపారులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. కాకినాడ జిల్లాలో 12 బార్లు, కోనసీమ జిల్లాలో 10, తూర్పుగోదావరిలో 16 బార్లకు ఈ నెల 14లోపు దరఖాస్తులు రావాల్సి ఉంది. 15న లాటరీ నిర్వహిస్తారు. తొలి విడత స్పందన లేని నేపథ్యంలో మలివిడత అన్ని బార్లకు దరఖాస్తులు వచ్చేలా చూడాలంటూ ఉన్నతాధికారులు ఎక్సైజ్ అధికారులపై తెగ ఒత్తిడి తెస్తున్నారు.దీంతో ఇప్పుడు జిల్లాల్లో ఎక్సైజ్ అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

నేడు ఎక్సయిజ్ శాఖ డీసీ రాక

ఎక్సైజ్ శాఖ డీసీ మంగళవారం కాకినాడ వస్తున్నారు.మూడు జిల్లాల ఎక్సైజ్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. దీనికి అధికారులు సమాయత్తం అవుతుండగా.. తమ గోడు వినిపించుకోడానికి వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. మొదటి నోటిఫికేషన్‌కి దరఖాస్తుల విషయంలో కోనసీమ జిల్లా ఎక్సైజ్ అధికారిపై వేటు పడగా, తూర్పు గోదావరి త్రుటిలో తప్పించుకొంది. కాకినాడ కాస్త పర్వాలేదని అనిపించింది. అయితే ఇప్పటికే కొన్ని బార్‌లు కేటాయింపు జరగడంతో నిబంధనల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ మార్పులు ఉండే అవకాశం లేదు. అధికారులు ప్రైవేటు షాపుల దరఖాస్తులదారులకు మెసేజ్‌లు పంపుతున్నా పరిస్థితుల్లో మార్పు కానరావడం లేదు. బార్ పాలసీ వల్ల గతం కంటే మెరుగైన లాభాలు వస్తాయని ప్రభుత్వం చెబుతున్నా.ఆ అంశాన్ని క్షేత్రస్థాయిలోకి ఎక్సయిజ్ అధికారులు తీసుకెళ్లలేకపోతున్నారనే వాదన వినవస్తోంది.



పోలవరమే

- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు వేగవంతం
- 33 గ్రామాల ప్యాకేజీ అప్రూవల్ కమిషరేట్‌కు
- ప్రాసెస్‌లో 11 గ్రామాల ప్యాకేజీ

అప్రూవల్ వస్తే డబ్బు

మొదటి దశ ఆర్‌అండ్ ప్యాకేజీ అమలు వేగవంతం చేశాం. 32 గ్రామాల ప్యాకేజీ నివేదికలు అప్రూవల్‌కు పంపాం. అప్రూవల్ వస్తే నిర్వాసితుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బు జమవుతుంది.

- అభిషేక్, పోలవరం అధికారి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పోలవరం ప్రాజెక్టు మొదటి దశ ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ అమలు వేగవంతమైంది. పెండింగ్‌లో ఉన్న 44 గ్రామాలకు సంబంధించిన ప్యాకేజీలో 33 గ్రామాల లబ్ధిదార్లను ఎంపిక చేసి ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ అనుమతికి పంపింది. మరో 11 గ్రామాల నివేదికను 15 రోజుల్లో పూర్తి చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు. పునరావాస కాలనీల నిర్మాణాలు వేగవంతం చేయనుంది. వాటిపాత కాంట్రాక్టర్లను నిలిపివేశారు. కొత్త సంస్థల ఎంపికకు టెండర్లు పిలిచారు.అవి ఖరారు కావాల్సి ఉంది.

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి మొదటి దశలో 41.15 కాంటూరు వరకూ భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. గత వైసీపీలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్యాకేజీ పనులను తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి దశను ప్యాకేజీ 1ఏ,1బీగా విభజించి అమలు చేయడం ఆరంభించింది.ముంపు గ్రామాల్లో మొత్తం 38,060 పీడీఎఫ్‌లు (ప్రాజెక్టు డిస్‌ప్లేస్‌మెంట్ ఫ్యామిలీలు) ఉన్నాయి. అందులో మొదటి దశ 1ఏలో 26,946 పీడీఎఫ్‌లు ఉన్నాయి.వాటిలో ఇప్పటి వరకు 19,482 పీడీఎఫ్‌లకు ప్యాకేజీ చెల్లించారు.మొదటి దశ1బీలో 27,114 పీడీఎఫ్‌లు ఉండగా వాటిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ పరిధి కుమ్మరిలోవలోని 472 పీడీఎఫ్‌లకు ప్యాకేజీ చెల్లించారు. మొత్తం రూ.1212.95 కోట్లు చెల్లించారు. కానీ 1బీలో 2021 వరద సమయంలో మరో 48 గ్రామాలు మునిగిపోయాయి. అవి వాస్తవానికి రెండో దశ అయిన 45.75 కాంటూరు పరిధిలో ఉన్నాయి. కానీ మునిగిపోవడం వల్ల మొదటి దశ 41.15 కాంటూరు పరిధిలోకి తెచ్చి 1బీ పరిధిలో పెట్టి ప్యాకేజీ అమలు చేస్తున్నారు. దీంతో మిగతా పీడీ ఎఫ్‌లు ఇందులో కలిశాయి. ప్రస్తుతం కలిసిన 48 గ్రామాల పరిధిలో 4 గ్రామాల్లో ప్రజలు లేరు. అందువల్ల మిగిలిన 44 గ్రామాల పరిధిలోని ప్రజలకు ప్యాకేజీ అమలు చేస్తున్నా రు. అందులో ఇప్పటికే 33 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి వారికి రావాల్సిన లబ్ధిని నిర్ణయించి ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ అనుమతికి ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు అధికారి కార్యాలయానికి పంపించింది. ఇందులో కెఆర్.పురం యూనిట్ పరిధిలో 13 గ్రామాలు, చింతూరు యూనిట్ పరిధిలో 30 గ్రామాలు ఉన్నాయి. అనుమతులు వచ్చేస్తే ఇక్కడ ఎస్టీ, ఎస్సీలకు ఒక్కో కుటుంబానికి రూ.6.86 లక్షలు, ఇతరులకు రూ.6.36 లక్షల వంతున పరిహారం ఇస్తారు. చింతూరు కెఆర్‌పురంలో లచ్చిరెడ్డిగూడెం, టేకూరు, చింతూరు పరిధిలో మరో 11 గ్రామాలు ప్యాకేజీని సిద్ధం చేస్తున్నారు. వాటిలో గుండుగూడెం, వీఆర్‌పురం, ఏజీ కోడేరు, చింతూర్, మల్లెతోట, టేకులబోరు, కూనవరం గ్రామాలు ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టు రెండో దశ అంటే 45.75 కాంటూరు వరకూ విస్తరణ ఉంది. ఆ పరిధిలో మరో 201 గ్రామాలు వాటి పరిధిలో సుమారు 58 వేల కుటుంబాలు ఉన్నాయి. ఇక మొదటి దశ 1ఏ పరిధిలో 26,946 కుటుంబాలకు 75 పునరావాస కాలనీలు నిర్మించాల్సి ఉంది. అందులో 26 పూర్తయ్యాయి. ఇంకా 49 వివిధ దశల్లో ఉన్నాయి.గతంలోనే టీడీపీ హయాంలో వీటిలో చాలా కాలనీల నిర్మాణం మొదలు పెట్టగా తర్వాత వచ్చిన వైసీపీ నిర్లక్ష్యం చేసింది.తెలుగుదేశం కూటమి ప్రభుత్వం పాత కాంట్రాక్టర్లను రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలిచింది. అవి ఖరారైన వెంటనే పనులు మొదలవుతాయి.




కొవ్వూరులో అంబులెన్స్ సర్వీస్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తదితరులు

అత్యవసర వైద్య సేవలకే అంబులెన్స్‌లు

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్/కొవ్వూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందించడానికి కొత్తగా అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు (ఏఎల్ఎస్) అంబులెన్సులు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు తొలి విడతగా మూడు ఏఎల్ఎస్ అంబులెన్సులను కేటాయించిందని వెల్లడించారు. మూడు కొత్త అంబులెన్సులను ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంకతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం జిల్లాలో 21 అంబులెన్సులు పనిచేస్తున్నాయని, వీటిలో 11 పాత అంబులెన్సుల స్థానంలో ఆదునిక వైద్య సౌకర్యాలతో కూడిన ఐదు ఏఎల్ఎస్ అంబులెన్సులు, ఆరు బేసిక్ లైఫ్ సపోర్టు అంబులెన్సులను ప్రభుత్వం జిల్లాకు మంజూరు చేసిందన్నారు. తొలి విడతగా జిల్లాకు వచ్చిన మూడు అంబులెన్సులను మూడు నియోజకవర్గాలకు పంపుతున్నామని తెలిపారు. రానున్న రెండు వారాల్లో మిగిలిన ఎనిమిది అంబులెన్సులు జిల్లాకు చేరతాయని వివరించారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు (ఏఎల్ఎస్) అంబులెన్స్‌లను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు రెవిన్యూ డివిజన్‌కు 3 వాహనాలను కేటాయించారన్నారు. ఒకేసారి ఇద్దరు పేషెంట్లకు ఆక్సిజన్, వెంటిలేటర్ అందించే సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ ఎస్ఎం పద్మ, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ పాల్గొన్నారు.

మీకు నేనున్నా..



మీ సమస్యలు చెప్పండి నేను పరిష్కరిస్తా.. అంటూ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దివ్యాంగ విద్యార్థులను ప్రశ్నించారు..రాజమహేందరవరం దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.దీనిలో భాగంగా పలువురు దివ్యాంగ విద్యార్థుల సమస్యలు విన్నారు.. పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. - రాజమహేంద్రవరం సిటీ



పెద్దాసుపత్రిలో.. దొంగలు!

- జీజీహెచ్‌లో ఏసీ కాపర్‌పైపులు చోరీ
- రూ.50 వేలు ఉంటాయని లెక్క
- సెక్యూరిటీ గార్డుల నుంచి వసూలు?
- ఆసుపత్రి ఉద్యోగుల్లో చర్చనీయాంశం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో కొద్దిరోజుల క్రితం ఏసీ కాపర్ పైపులు చోరీకి గురయ్యాయి. ఆసుపత్రి పై అంతస్తులో సూపరింటెండెంట్ ఛాంబర్‌కు సమీపంలోని ఒక డిపార్టుమెంట్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. దీనిపై ఆసుపత్రి అధికారులు భగ్గుమన్నారు. ఆసుపత్రి సెక్యూరిటీ ఇన్‌ఛార్జిని పిలిపించి మాట్లాడారు. ఏసీ టెక్నీషియన్‌ను పిలిపించి చోరీకి గురైన కాపర్ పైపుల విలువ కట్టించారు. సుమారు రూ.50 వేలు విలువ కట్టినట్టు తెలిసింది. రాత్రిపూట సెక్యూరిటీ గార్డులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడం వల్లే కాపర్‌పైపులు చోరీకి గురయ్యాయని నిర్ణయానికి వచ్చి ఆ మొత్తాన్ని వారి నుంచి వసూలు చేయాలని నిర్ణయించారు. గత నెలలో సెక్యూరిటీ గార్డులకు జీతాలు పడగానే ఒక్కొక్కరి నుంచి రూ.700లు చొప్పున వసూలు చేసేశారు. తమకొచ్చే జీతాలే అంతంతమాత్రంగా ఉంటాయని, చోరీ జరిగిందనే కారణంతో తమ నుంచి ఇలా డబ్బులు వసూలు చేయడం భావ్యం కాదని కొంతమంది సెక్యూరిటీ గార్డులు మొత్తుకున్నా ససేమిరా ఇవ్వాల్సిందే అంటూ తీసుకున్నారు. ఇలా సుమారు రూ.40,000లు వసూలైనట్టు సమాచారం. తప్పు ఎవరు చేశారో తెలియదు కానీ సెక్యూరిటీ గార్డులను మాత్రం బలిపశువులుగా చేశారు. చోరీ ఎక్కడ జరిగిందో తేలితే మరోసారి జరగకుండా జాగ్రత్త పడొచ్చు. అలా కాకుండా అధికారులు కప్పిఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ సొమ్ము ఎక్కడుంది ?

సెక్యూరిటీ గార్డుల నుంచి వసూలు చేసిన సొమ్ములపై ఇప్పుడు ఆసుపత్రి ఉద్యోగుల్లో తీవ్రస్థాయిలో చర్చ నడుస్తోంది. ఇలా వసూలు చేసిన సొమ్ము ఎవరికి ఇచ్చారు ? అధికారులకు ఇచ్చారా ? లేక ఎవరైనా తీసుకున్నారా ? ఇవ్వకపోతే ఎవరి దగ్గర ఉంది ? ఈ సొమ్ము ఏం చేయనున్నారు ? అంటూ అనేకరకాలుగా చర్చించుకుంటున్నారు. సొమ్ములు వసూలు చేసి దాదాపు నెల రోజులు కావడంతో ఇప్పుడు సెక్యూరిటీ గార్డులు అందరిలోనూ ఇలాంటి అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజంగానే అధికారులు వసూలు చేయమన్నారా లేక ఎవరైనా ఒత్తిడి చేశారా అనే చర్చ కూడా నడుస్తోంది. ఇదిలా ఉంటే వారం రోజుల కిందట ఆపరేషన్ థియేటర్లకు సంబంధించిన ఏసీ కాపర్ పైపులు చోరీకి గురైనట్టు తెలిసింది. దీనికి కూడా తమనే బాధ్యులను చేస్తే మా పరిస్థితి ఏంటంటూ సెక్యూరిటీ గార్డులు మదన పడుతున్నారు. మొత్తానికి ఈ వసూళ్ల వ్యవహారం ఇప్పుడు జీజీహెచ్ ఉద్యోగ వర్గాల్లో హాట్‌హాట్‌గా మారింది.

సొసైటీలోని యూరియా నిల్వల్లో వ్యత్యాసం

భూపాలపట్నంలో స్టాకు తేడా - అమ్మకాలు నిలుపుదల



రాజానగరం , సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భూపాలపట్నం సొసైటీలో యూరియా బస్తాల నిల్వలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్‌కు గొడౌన్‌లో ఉన్న బస్తాలకు వ్యత్యాసాలను గుర్తించడంతో రూ19.80 లక్షల విలువైన యూరియా బస్తాల అమ్మకాలను విజిలెన్స్ అధికారులు నిలిపివేశా రు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జి.మధుబాబు, అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌వీ.లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయాధికారి ఎ.కళ్యాణసూర్యకుమార్ తమసిబ్బందితో కలిసి సోమవారం భూపాలపట్నంలోని సొసైటీ, మనగ్రోమోర్ దుకాణంలో యూరియా విక్రయాలు, నిల్వలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భూపాలపట్నం సొసైటీ నిల్వలో తేడాలు గుర్తించి యూరియా అమ్మకాలు తాత్కాలికంగా నిలిపివేశారు.మన గ్రోమోర్‌లో సక్రమంగా ఉన్నట్టు గుర్తించారు.

మెడికల్ కళాశాలలపై వైసీపీ రాద్ధాంతం

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పది మెడికల్ కళాశాలల నిర్మాణ పనులు పీపీపీ పద్ధతిలో కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని ప్రయత్నిస్తుంటే ప్రైవేటు పరం చేస్తున్నామంటూ వైసీపీ ఎందుకు గగ్గోలు పెడుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మండిపడ్డారు.బిక్కవోలు మండల కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు.2020లో వైసీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేయించుకుని 2023 నాటికి పూర్తి చేయలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేంద్ర నిధులతో రాజమహేంద్రవరం, ఏలూరు, నంధ్యాల, పాడేరు, మచిలీపట్నం, పిడుగురాళ్లలో కళాశాలలు పూర్తి చేశామన్నారు. మిగిలిన పది కళాశాలల నిర్మాణాలు పూర్తి చేయాలంటే రూ.6 వేలు కోట్లు కావాలని, వీటి నిర్వహణకు ఏటా రూ.1500 కోట్లు కావాలన్నారు. పది కళాశాలలను పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేస్తున్నామని వీటి నియంత్రణ ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటుందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని వాటిని సరిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

డివిజనల్ పీజీఆర్ఎస్‌కు 19 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కేఆర్‌సీ తహశీల్దార్ అచ్యుతకుమారి

కొవ్వూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో స్వీకరించిన ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కరించాలని ఆర్డీవో కార్యాలయ కేఆర్‌సీ తహశీల్దార్ పి.అచ్యుతకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో జరిగిన డివిజనల్ పీజీఆర్ఎస్‌లో ఆమె 19 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అచ్యుతకుమారి మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారానికి వివిధ స్థాయిల్లో పరిష్కార వేదికలు ఏర్పాటు చేశారన్నారు. మండల, డివిజనల్ కార్యాలయాలతో పాటు 1100 కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై అవగాహనకు ఫ్లెక్సీలు


ఫ్లెక్సీలను ప్రదర్శిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, అధికారులు

కొవ్వూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనుమతి పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లతోనే ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. ఎల్ఆర్ఎస్ పథకంపై అవగాహన కల్పించే విధంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌పై పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. జీవో 139 ద్వారా అనధికార లేఅవుట్‌లలో ప్లాటుల క్రమబద్ధీకరణకు అక్టోబరు 23 వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని అనధికార లేఅవుట్‌లో ప్లాటులు కొనుగోలు చేసిన యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మున్సిపల్ అనుమతి పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్ల ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. గడువులోగా దరఖాస్తు చేసుకోవడం ద్వారా 14శాతం ఓపెన్ స్పేస్ చార్జీలలో 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జి.సందీప్, టౌన్ ప్లానింగ్ అధికారి టి.మణిరామ్, ఆర్ఐ బి.శ్యాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను తొలగించండి

కల్లుగీత కుటుంబాలకు ఉపాధి కల్పించాలి.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహమూర్తి

కొవ్వూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బెల్టు షాపులను తొలగించి కల్లుగీత కార్మిక కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం కొవ్వూరు సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కల్లుగీత కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా గీత కార్మికులను ఓటు బ్యాంకులా వాడుకుంటున్నారు తప్ప ఎన్నికల వాగ్దానాలను గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. మద్యం వరదలా పారుతుంటే కల్లు అమ్మకాలు లేక గీత కార్మికులు సంక్షోభంలో కూరుకుపోయారన్నారు. ఆదరణ పథకంలో సేఫ్టీ మోకులు, మోటారు సైకిళ్లు అందించాలన్నారు. కార్మికులకు గుర్తింపుకార్డులు అందించాలన్నారు. ఈ నెల 19న జరిగే జిల్లా మహాసభలో కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్, జె.పోసిరావు, జి.నరసింహారావు, ఎన్.సూరిబాబు, ఎస్.శ్రీనివాసరావు, కె.వీరబుజ్జి, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల కార్మికులు పాల్గొన్నారు.

వ్యాన్‌ను ఢీకొన్న బైక్.. ఇద్దరికి గాయాలు

కొవ్వూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యాన్‌ను ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడినట్టు కొవ్వూరు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.భగవాన్ దాస్ తెలిపారు. ఏలూరుకు చెందిన ఫ్యూజన్ ఫోర్స్ డిజిటల్ మార్కెటింగ్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న షేక్ బషీరుద్దీన్.. స్నేహితుడు కాపవరపు సుమంత్‌తో కలిసి కంపెనీ పనిమీద సోమవారం ఉదయం బైక్‌పై రాజమహేంద్రవరం బయలుదేరారు.కొవ్వూరు మండలం కాపవరం జియో పెట్రోల్ బంకు సమీపంలో ముందు వెళ్తున్న వ్యాన్‌ను సడన్‌గా ఆపడంతో వ్యాన్‌ను ఢీకొని ఇద్దరూ కింద పడిపోయారు. దీంతో గాయాలయ్యాయి. ఇద్దరినీ స్థానికులు రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం, బషీరుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ పేర్కొన్నారు.

అనంతపురం సభ ఏర్పాట్ల పరిశీలన


పార్కింగ్ ప్రదేశాన్నిశుభ్రం చేయిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల హామీల ప్రచారంలో భాగంగా ఈ నెల 10న అనంతపురం అర్బన్ ఏరియాలో జరిగే సూపర్ సిక్స్-సూపర్ హిట్ భారీ బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు రెండో రోజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సమావేశానికి వచ్చే వాహనాలను నిలుపుదల చేసేందుకు అవసరమైన పార్కింగ్ ప్రదేశాన్ని శుభ్రం చేయిస్తున్నట్టు తెలిపారు. పిచ్చిమొక్కలు తొలగించి, ఆ ప్రదేశంలో ఉన్న చెత్తాచెదారాలతో పాటు రాతిబండ్లను ప్రొక్లెయినర్ల సాయంతో తొలగించినట్టు పేర్కొన్నారు. మంగళవారం నాటికి బహిరంగ సభకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామన్నారు.

జిల్లా ఉత్తమోపాధ్యాయురాలికి సత్కారం


ఉపాధ్యాయురాలు కుసుమను అభినందిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాల్ధరి గ్రామ నెం.3 పాఠశాల ఉపాధ్యాయురాలు పి.కుసుమకు జిల్లా ఉత్తమోపాధ్యాయ అవార్డు రావడం అభినందనీయమని ఫౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు అన్నారు. ఈ మేరకు ఆమెకు సోమవారం గ్రామంలో అభినందన సమావేశం నిర్వహించారు. విద్యార్థులను ఉత్త మ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చీపుళ్ల కుమారి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఈర్పిన సత్యనారాయణ, కోమట్లపల్లి రామదాసు, చీలి బుజ్జిబాబు, సీహెచ్ లక్ష్మీనారాయణ, కోమట్లపల్లి విశ్వనాథం, కోరుమిల్లి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'రైతుల ముసుగులో అసత్య ప్రచారాలు'


సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నాయకులు

గోపాలపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై బురద జల్లేందుకు రైతుల ముసుగులో వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సొసైటీ అధ్యక్షుడు వడ్లమూడి రమేశ్, మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో సోమవారం ఇరువురు విలేకర్ల మాట్లాడుతూ మండల పరిధిలో రెండు సొసైటీలు, రెండు డీసీఎంఎస్ గోదాముల ద్వారా రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి 188.461 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని, అది కాకుండా 759.83 మెట్రిక్ టన్నుల యూరియా మండలానికి వచ్చిందన్నారు. ఇప్పటి వరకు 900.276 టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయన్నారు. ప్రస్తుతం ప్రయివేటు ఏజెన్సీల పరిధిలో 48.015 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. వీటితో పాటు మన గ్రోమోర్ ప్రయివేటు ఏజెన్సీలు, సొసైటీలకు మరో 50మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతికి సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులు వినియోగిస్తే యూరియా కొరతే ఉండదన్నారు. రైతుల ముసుగులో వైసీపీ నాయకులు యూరియా కృత్రిమ కొరత సృష్టించేందుకు పన్నాగాలు పన్నుతున్నారన్నారు. కార్యక్రమంలో రొంగల సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసాద్‌బాబు, కొడవటి గంగరాజు, మద్దిపాటి రమేశ్, జ్యేష్ట శ్రీధర్, సత్యనారాయణ, నాని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెరవలి,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లపై పనుల కారణంగా మంగళవారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అజ్జరం, వెంకటరాయపురం, సీతారామ్‌పురం, కాకరపర్రు, తీపర్రు గ్రామాలకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- మంత్రి కందుల దుర్గేష్
- 50 మందికి రూ.40 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- పీజీఆర్ఎస్ పరిశీలన


పెరవలిలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన మంత్రి దుర్గేష్

పెరవలి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం పెరవలిలోని దీపికా ఫంక్షన్ హాలులో.. నియోజకవర్గంలో అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకున్న 50 మందికి రూ.40 లక్షలు విలువైన సీఎం సహాయ నిధి చెక్కులు, పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని, కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 344 మందికి రూ.2,84,48,563 మేర లబ్ధి చేకూర్చామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఈ విధంగా సీఎం సహాయ నిధి నుంచి సాయం అందేది కాదని, ప్రస్తుతం రాజకీయాలకు అతీతంగా అందరికీ లబ్ధి జరిగే విధంగా అన్ని రకాల సంక్షేమ పథకాల్లో న్యాయం చేస్తున్నామన్నారు. ఎవరికైనా పథకం అందడం లేటు అవ్వొచ్చు కాని అందడం మాత్రం పక్కా అని ఆయన భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం రోడ్లను ఏ మాత్రం పట్టించుకోలేదని, ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామని, పెరవలి-నిడదవోలు రహదారి మరమ్మతులు చేపట్టామన్నారు.ఉసులుమరు-కానూరు సీసీ రోడ్డు వేసేందుకు పనులు ప్రారంభిస్తున్నట్టు మంత్రి చెప్పారు. ఇదిలా ఉండగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వివిధ శాఖల అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.ఆయా కార్యక్రమాల్లో నాయకులు పిప్పర రవి, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సౌజన్య సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, తహశీల్దార్ నిరంజన్, ఎంపీడీవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- మలకపల్లి సొసైటీ సీఎస్ఆర్ నిధులతో రెండు హైస్కూళ్లకు ఉపకరణాలు


మలకపల్లి హైస్కూల్‌కు వంట పాత్రలు అందజేసిన ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మలకపల్లిలో సొసైటీ సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి అధ్యక్షుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి సహకారంతో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల రూ.65 వేలు విలువైన వంట పాత్రలు, స్పోర్ట్స్ కిట్‌లు అందజేశారు. అనంతరం స్పోర్ట్స్ డే సందర్భంగా పాఠశాలలో టెన్నికాయిట్, వాలీబాల్, కబడ్డీ కోర్టులను ప్రారంభించి, పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.అలాగే పెద్దేవం స్కూల్‌కి రూ.75వేలు విలువైన డిజిటల్ కంప్యూటర్‌ను అందజేశారు. విద్యాభివృద్ధికి సహకరించిన సుబ్బరాయచౌదరిని ఎమ్మెల్యే అభినందించారు. ఇదిలా ఉండగా పెద్దేవం, మలకపల్లి గ్రామాలకు చెందిన 8 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3,37,041 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, మద్దిపాటి ప్రకాశం, ఎంపీటీసీ వీర హరిబాబు, కాకర్ల సత్యేంద్రకుమార్, ఇందుగుల రామకృష్ణ, జొన్నలగడ్డ శ్రీనివాస్, కొప్పాక జవహర్, గంటా కృష్ణ, మద్దుకూరి శ్యాం, పాల్గొన్నారు.

మద్దూరుకు ఆర్టీసీ సర్వీసు

కొవ్వూరు మండలం మద్దూరులో సోమవారం రాత్రి నిడదవోలు వయా మద్దూరు, వాడపల్లి మీదుగా రాజమహేంద్రవరం ఆర్టీసీ సర్వీసును ఎమ్మెల్యే ముప్పిడి ప్రారంభించారు. స్వయంగా టిక్కెట్టు కొట్టి ప్రయాణికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్టీసీ సేవలందజేస్తోందన్నారు. ఈ బస్సు ఉదయం 8గంటల నుంచి 4సర్వీసులు మద్దూరు మీదుగా నడుస్తాయన్నారు. మండలంలో సీతంపేట, బంగారంపేట, మద్దూరు, వాడపల్లి, ఔరంగాబాద్‌కు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, బేతిన నారాయణ, నాయుడు వీర్రాజు, వీరమళ్ల రామకృష్ణ, కేవీకే రంగారావు పాల్గొన్నారు.

అనుమతి మేరకే పొగాకు పండించండి

- స్వీయ నియంత్రణ పాటించాలి
- బాడవ పొలాల్లో పంట వేయొద్దు
- పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్
- కొత్తగా బ్యారన్ లైసెన్సులు ఇవ్వాలి: ఎస్సీ, ఎస్టీ రైతులు


రైతులతో సమావేశంలో మాట్లాడుతున్న యశ్వంత్‌కుమార్

దేవరపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతి మేరకే పొగాకు పండించాలని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ పేర్కొన్నారు. పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి అనంతరం పొగాకు బోర్డు కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ రైతులు స్వీయ నియంత్రణ పాటించాలన్నారు. ఈ ఏడాది పొగాకు పంటకు ప్రారంభంలో ధర రూ.240 ఉండగా క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం కిలో ధర రూ.375 పలుకుతుందన్నారు. ఎన్ఎల్ఎస్ ఏరియాలో 42మిలియన్ కిలోల అనుమతి ఇవ్వగా అదనంగా 12 మిలియన్ కిలోలు ఉత్పత్తి పెరిగిందన్నారు. అంతర్జాతీయంగా భారతదేశంలో పండించే పొగాకుకు గట్టిపోటీ ఉంటుందని ముఖ్యంగా జింబాబ్వే, బ్రెజిల్, ఆఫ్రికా వంటి దేశాల్లో పొగాకు ఉత్పత్తి పెరిగిందన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని పంట నియంత్రణ పాటించాలన్నారు. గత ఏడాది తుఫాన్ వల్ల రైతులు తీవ్రంగా పంట నష్టపోవడంతో రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, ఏలూరు ఎంపీ పి.మహేశ్ సహకారంతో పొగాకు అదనపు పంటకు పెనాల్టి లేకుండా వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ ఏడాది అదనపు పంటకు పెనాల్టి 10-20శాతం వరకు ఉత్పత్తి అయిన పొగాకుకు 2-3శాతం పెనాల్టీ విధించినట్టు ఆయన తెలిపారు. త్రొరేడు రైతులు ఎన్ఎల్ఎస్‌కు బ్యారన్‌కు 35క్వింటాళ్లు అనుమతి ఇస్తున్నారని, తకు 21 క్వింటాళ్లే అనుమతి ఇస్తున్నారని, అలాంటి వ్యత్యాసం లేకుండా చూడాలని చైర్మన్‌ను స్థానిక రైతులు కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి పొగాకు బోర్డు సమావేశంలో చర్చించి న్యాయం చేస్తామన్నారు. బాడవ పొలాల్లో పొగాకు పంట వేయొద్దని, అలా వేస్తే బోర్డు చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు కొత్తగా బ్యారన్ లైసెన్సులు ఇవ్వాలని కోరగా ఈ విషయం తన పరిధిలో లేదని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ జీఆర్‌కే ప్రసాద్, దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి హేమస్మిత, పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాస్, కేవీవీ సత్యనారాయణ, పరిమి శ్రీరామకృష్ణ, యాగంటి వెంకటేశ్వరరావు, సింహాద్రి ధర్మవతారం, నరహరశెట్టి రాజేంద్రబాబు, బిక్కిన నాగరాజు, నాయుడు దుర్గాప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై వైసీపీ నాయకుల రాజకీయం


నల్లజర్లలో కొరత లేదు.. టీడీపీ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా సాహెబ్


సమావేశంలో మాట్లాడుతున్న మీరా సాహెబ్

నల్లజర్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు రైతులను రెచ్చగొట్టే విధంగా యూరియా కొరత ఉందని అలజడి సృష్టిస్తున్నారని, రైతులతో రాజకీయం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా సాహెబ్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగులో మండలానికి 2,350 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటివరకు 2,054 మెట్రిక్ టన్నులు వచ్చిందన్నారు. 1,966 మెట్రిక్ టన్నులు యూరియా రైతులకు అందించినట్టు చెప్పారు.ఈ నెలలో 296 మెట్రిక్ టన్నులు వస్తుంద న్నారు. రైతులకు యూరియ కొరత లేదన్నారు. రాష్ట్రంలో రైతులను ఆందోళనకు గురి చేసే కుట్ర వైసీపీ చేస్తోందని, మండలంలో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు ఎప్పుడూ అందుబాటులో ఉండే విధంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అధికారులతో చర్చిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ డైరెక్టర్ కూచిపూడి ఉదయభాస్కరావు, పసుమర్తి ప్రభాకరావు, జమ్ముల సతీష్, ప్రకాశరావుపాలెం సర్పంచ్ జార్జ్‌విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని రైతులు నమ్మొద్దు: సొసైటీ అధ్యక్షులు


సమావేశంలో మాట్లాడుతున్న ఆండ్రూ అనీల్

దేవరపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేదని రైతులు ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మవద్దని టీడీపీ మండలాధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షుడు ఆండ్రూ అనీల్ పేర్కొన్నారు.దేవరపల్లి సొసైటీలో సోమవారం దేవరపల్లి, గౌరీపట్నం, యర్నగూడెం, చిన్నాయిగూడెం, కురుకూరు, త్యాజంపూడి సొసైటీల అధ్యక్షులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో 9500ఎకరాల్లో వరిపంట వేశారని, గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా 30శాతం యూరియా రైతులు వాడుకున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చివరి మూడేళ్లలో 1750 టన్నుల యూరియా వాడగా ఒక్క ఏడాదిలో 1600టన్నుల యూరియా వాడారని అన్నారు. యూరియా కొరత లేదని మండలంలోని 7 సొసైటీల్లో యూరియా రైతులకు అందుబాటులో ఉందన్నారు. దేవరపల్లిలో డీసీఎంఎస్ బ్రాంచ్‌లో 21టన్నుల యూరియా సిద్ధంగా ఉందని తెలిపారు. అనంతరం ఎరువుల గొడౌన్‌ను పరిశీలించారు. డీసీఎంఎస్ డిపో మేనేజర్ రమేశ్ వివరాలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్‌పర్సన్‌లు ఉప్పులూరి రాంబాబు, పెనుమత్స సుబ్బరాజు, వెలమాటి భాస్కరరావు, కొడూరి వెంకటరత్నం, గన్నమని గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక ప్రగతిలో ఎల్ఐసీ కీలకం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక ప్రగతిలో ఎల్ఐసీ పాత్ర మరువలేనిదని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎన్ సూర్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో మేనేజర్ ఎన్.శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన బీమా వారోత్సవాల ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి క్విజ్‌లో గెలుపొందిన హైస్కూల్ విద్యార్థులకు, ఎల్ఐసీ ఏజెంట్లు, ఆఫీసు సిబ్బందికి బహుమతులు అందజేశారు. మేనేజర్ శ్రీరామ్ మాట్లాడుతూ పొదుపును సేకరించి జీవిత బీమా వ్యాపారం చేయడంలో ఇప్పటికీ ఎల్ఐసీ ముందంజలోనే ఉందని, దానికి నిదర్శనం షేర్ మార్కెట్ అధికంగా ఉండడమేనన్నారు.

గణపతికి పరామర్శ

చాగల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు జుట్ట గణపతి భార్య దుర్గ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర గణపతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దుర్గ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోడపాటి ముత్యాలరావు, తాళ్ళూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో అన్నదానం

గోపాలపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీలో గణేశ్ ఉత్సవాల సందర్భంగా 37వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 2వేల మంది భక్తులు పాల్గొన్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

అక్షరాస్యత దినోత్సవం

నల్లజర్ల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని మండలంలో కవులూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆత్కూరి అమర్‌నాథ్, మాజీ అక్షర దీక్ష ప్రేరక్ కేసీహెచ్ పుల్లయ్య ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు, పలకలు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రకృద్దీన్ అలీ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రామారావు జన్మదిన వేడుకలు

కొవ్వూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. సోమవారం కొవ్వూరులో రామారావును డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామారావు కార్యకర్తలు, నాయకుల మధ్య కేక్ కట్‌చేశారు. పట్టణ, మండలానికి చెందిన జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పింఛన్ల పంపిణీ నుంచి మినహాయించండి

దేవరపల్లి, సెప్టెంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రతినెల పింఛన్లు పంపిణీ చేసే విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డ్వాక్రా వీవోఏలు కోరారు. ఈ మేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేవీకే దుర్గారావుకు సోమవారం అందజేశారు.పని ఒత్తిడి వల్ల ప్రతి నెలా పింఛన్లు పంపిణీ ఇబ్బంది అవుతుందని, ఆ విధుల నుంచి తమను మినహాయించాలని కోరారు.



ఆలయాల్లో సంప్రోక్షణ పూజలు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం ముగింపు అనంతరం సోమవారం మండలంలో పలు దేవాలయాల్లో సంప్రోక్షణ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తాడిపర్రు గ్రామంలో పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ సందర్భంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలో అన్ని దేవాలయాల్లో వేదమంత్రాలతో పూజా కార్యక్రమాలు జరిపారు.